ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

https://prajakalam.com
RNI No.TELTEL/2010/33275
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 10-01- 2025 సంపుటి: 15 , సంచిక: 282, నిజామాబాద్ పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆
Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada



### 7న ఎమ్మార్పీఎస్

## 'దండోరా'

### ఎస్సీ వర్గీకరణ అమలే లక్ష్యం : మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు లక్ష డప్పులతో దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన చేపట్టనుంది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఈ సాంస్కృతిక మహా ప్రదర్శనకు మద్దతుగా ఓయూలో విద్యార్థి సంఘాల నాయకులతో గురువారం ఓ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని అన్నారు. ఇప్పటికీ కొందరు మాలలు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతిమ పోరాటంగా మాదిగల అస్తిత్వమైన డప్పుతో ఫిబ్రవరి 7న మాదిగల గుండె చప్పుడు వినిపిస్తామని చెప్పారు. ఈ దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఉపాధి బిల్లులు

# మంజూరు చేయండి



- పంచాయతీ ఉద్యోగులకు జీతాలు
- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతి నెలా వేతనాలు చెల్లింపు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి శుభవార్త చెప్పారు. పంచాయతీల్లో పనిచేస్తున్న 92,351 మంది ఉద్యోగులకు ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేసే ఉద్యోగులకు వేతనాల కింద ప్రతి నెలా రూ.116 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, ఈ చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని పంచాయతీరాజ్, ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి గ్రామస్థాయి ఉద్యోగుల జీతాలను ప్రతి నెలా చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలు, పెండింగ్ బిల్లుల చెల్లింపుపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. గత ఏప్రిల్ నుంచి జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని చెప్పారు. అలాగే, వివిధ పథకాల కింద కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాబట్టుకోవాలని అధికారులకు సూచించారు.

**విమానాశ్రయంతో మహా వరంగల్: సీఎం**

వరంగల్ మహా నగరంగా ఎదిగేలా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూసేకరణ, ఇతర ప్రణాళికలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలన్నారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని సీఎం సూచించారు.

తరువాయి 2వ పేజీలో...



### క్యాబినెట్ అనుమతి లేకుండా

# నిర్ణయం ఎలా?

**ఫార్ములా-ఈ కేసులో ఆరున్నర గంటల విచారణ**
**మాజీ మంత్రికి పలు కోణాల్లో 50కి పైగా ప్రశ్నలు**

హైదరాబాద్, జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు.. తెలియదు అన్న సమాధానాలు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచటం కోసం తాము కృషి చేస్తే ఇప్పుడు రంధ్రాన్వేషణ ఏమిటంటూ నిలదీత.. అడిగిన ప్రశ్నలే మళ్లీ ఎన్నిసార్లు అడుగుతారు? కావాలంటే, అరెస్టు చేసుకోండని సవాల్.. చివరికి.. 'మీరిక వెళ్లొచ్చు' అని అధికారులు చెప్పినప్పుడు.. ముఖంలో ఆశ్చర్యంతో కూడిన ఆనందం.. ఏసీబీ విచారణ సందర్భంగా కేటీఆర్‌లో కనిపించిన భిన్న స్పందనలు ఇవీ..! ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గురువారం ఆరున్నర గంటలకు పైగా విచారించి 50కి పైగా ప్రశ్నలు సంధించారు. ఉదయం పది గంటల సమయంలో ఏసీబీ కార్యాలయానికి తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి వెళ్లిన కేటీఆర్ సాయంత్రం ఐదు తర్వాత బయటకు వచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి, ఆయన కన్పించే విధంగా మరికొంత దూరంలో

తరువాయి 2వ పేజీలో...

### ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో

# ఫిర్యాదులకు వెబ్‌సైట్



- ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- పథకంలో పారదర్శకతకు పెద్దపీట
- దరఖాస్తుల పరిశీలన 95% పూర్తి

హైదరాబాద్, జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చే యాలని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు వీలుగా ప్రత్యేక వెబ్‌సైట్ ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులోని గ్రీవెన్స్ మాడ్యూల్‌కు అందిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారు ఫోన్‌కు సందేశం ద్వారా తెలియజేయనున్నట్టు తెలిపారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ప్రారంభించిన సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాడ్యూల్‌కు వచ్చిన ఫిర్యాదులు గ్రామాల పరిధిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్ల ద్వారా సంబంధిత అధికారులకు వెళ్తాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పథకం అమలులో మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇల్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇంటిని నిర్మించుకోవచ్చని చెప్పారు. చివరి లబ్ధిదారుని వరకు ఇండ్లను మంజూరు చేసి నిర్మించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల పరిశీలన బుధవారంనాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 95 శాతం మేర పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88శాతం వరకు పూర్తయిందన్నారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఇళ్ల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు.



### ఆరోగ్యశ్రీ, ఫీజు బకాయిలు వెంటనే

# విడుదల చేయండి

**- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ**

హైదరాబాద్, జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు తక్షణం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. విద్య, వైద్యం విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ఉందని, ఇది ఏమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది పేద ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అంటూ రేవంత్‌కు గురువారం బండి లేఖ రాశారు. 'ఆరోగ్యశ్రీ' పథకం అమలులో సీఎం అనుసరిస్తున్న తీరు 'నోటితో పొగిడి.. నొసటితో వెక్కిరించినట్లుగా' ఉందని, ఒకవైపు 'ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు, ఆరోగ్యసేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించి, ఆచరణలో మాత్రం అసలు బిల్లులే చెల్లించకుండా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను ఇబ్బంది పెడుతున్నారని లేఖలో విమర్శించారు. "మీ ఏడాది పాలనలో దాదాపు రూ.1000 కోట్ల మేరకు ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులు చెబుతున్నాయి. ఫీజు రీయిబర్స్‌మెంట్ పథకాన్ని కూడా మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నట్లు కనిపిస్తోంది. దాదాపు రూ.7వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో క్లియర్ చేయాలి" అని లేఖలో బండి పేర్కొన్నారు.

**ఉచిత సర్జరీ క్యాంప్ అభినందనీయం**

సేవా భారతి, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్స్, మెర్సీ మిషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 30 వరకు మల్లేపల్లి సీతారాంబాగ్ ప్రాంతంలోని డాక్టర్ ఈశ్వర్ చంద్ర ఆస్పత్రిలో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తుండటం అభినందనీయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కాగా, ఈ మెగా క్యాంప్‌లో పాల్గొనాలనుకునే వారు 9848241640, 9908630301 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

### జనవరి 26వ తేదీ నుంచి

# ప్రతి రైతుకు రైతు భరోసా

## విద్యుత్ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

- ఆరు నెలల్లో వనపర్తి నియోజకవర్గానికి రూ 70 కోట్ల అభివృద్ధి పనుల మంజూరు
- కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వనపర్తి జనవరి 9 (ప్రజాకలం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఈ క్రమంలోనే అవసరం ఉన్న ప్రతి చోట విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటును చేస్తుందని, ఇప్పటివరకు వనపర్తి నియోజకవర్గానికి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అభ్యర్థన మేరకు రూ. 70 కోట్ల నిధుల తో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు వనపర్తి నియోజకవర్గ పరిధిలోని

తరువాయి 2వ పేజీలో...





**నిబంధనలు తెలిసిన మీరు.. ఎలా ఉల్లంఘించారు?**

**అర్వింద్ కుమార్‌ను ప్రశ్నించిన ఈడీ.. వాంగ్మూలం నమోదు**

హైదరాబాద్, జనవరి 9: ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి పురపాలకశాఖ మాజీ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయనను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)కు విదేశీ కరెన్సీలో నిధులు పంపించాలని హెచ్ఎండీఏను ఎందుకు ఆదేశించారు? విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిపినపుడు ఆర్‌బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదు? తదితర అంశాలపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. బుధవారం నాటి విచారణలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన జవాబుల ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

### స్కిల్స్ యూనివర్సిటీలో

# కొత్తగా 3 కోర్సులు

**- ఎండోస్కోపీ, టీవర్క్స్, మెడికల్ కోడింగ్.. ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల**

SKILLS UNIVERSITY
YOUNG INDIA
TELANGANA

హైదరాబాద్, జనవరి 9 : తెలంగాణ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, కొత్తగా మరో మూడు కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన జారీచేసింది. కిమ్స్, ఏఐజీ ఆస్పత్రులు, టీ వర్క్స్ భాగస్వామ్యంతో ఈ మూడు కోర్సులకు ప్రవేశ ప్రకటన ఇచ్చింది. మూడింటిలో ఏఐజీ హాస్పిటల్స్‌లో ఎండోస్కోపీ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమం ఒకటి. దీని కాల వ్యవధి ఆరునెలలు. ఇంటర్ (బైపీసీ)50శాతం మార్కులతో ఉత్తీర్ణులై, 25ఏళ్లలోపు ఉన్నవారు అర్హులు. ఎండోస్కోపీ ఆపరేషన్స్‌పై తరగతి గది, ప్రాక్టికల్ శిక్షణ రెండూ ఉంటాయి. దీనికి ఫీజు రూ.10వేలు. కోర్సు పూర్తయిన తర్వాత ఏఐజీతో పాటు ఇతర ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలుంటాయి. ఇక రెండో కోర్సు... టీ వర్క్స్ ప్రోటోటైపింగ్ స్పెషలిస్ట్ కార్యక్రమం. కాల వ్యవధిబీ 2 నెలలు. పదో తరగతి ఉత్తీర్ణులై 18-25ఏళ్ల వయసున్నవారు అర్హులు. డిజైన్ థింకింగ్, క్యాడ్/క్యామ్‌పై అవగాహన కల్పించడం, 3డీ ప్రింటింగ్, వెల్డింగ్, సీఎన్సీ మెషిన్, అడ్వాన్స్‌డ్ ర్యాపిడ్ ప్రోటోటైపింగ్, ప్యాకేజింగ్, వుడ్, లేజర్ కటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. కోర్సు ఫీజు రూ.3వేలు. కోర్సు పూర్తిచేసినవారికి జూనియర్ ప్రోటో టైపింగ్ టెక్నీషియన్‌గా అవకాశాలు రావొచ్చు. ఇక మూడో కోర్సు... మెడికల్ కోడింగ్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం. కాల వ్యవధి 55 రోజులు. మెడికల్ కోడింగ్, సాఫ్ట్ స్కిల్స్, మాస్టర్ మెడికల్ టెర్మినాలజీ, కోడింగ్ సిస్టమ్స్‌పై శిక్షణ ఉంటుంది. బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై 18-25ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులు. ఫీజు రూ.18వేలు. ఉత్తీర్ణులైనారు మెడికల్ కోడింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ మెడికల్ అనువాదకులుగా ఉద్యోగాలు తెచ్చుకునేందుకు అవకాశాలుంటాయి.

## ఉపాధి బిల్లులు
# మంజూరు చేయండి

మొదటి పేజీ తరువాయి...

ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్‌లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్ ఎదిగేలా ప్రణాళికలు ఉండాలని రేవంత్ సూచించారు.

**నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అంశాలపై చర్చించి, కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున ఇస్తామని, భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున భృతి అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తెలిపారు. ఈ రెండు పథకాలకు సంబంధించి మార్గదర్శకాలు దాదాపు ఖరారయ్యాయి. రేషన్ కార్డులు లేనివారికి కొత్తగా రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు పాతవాటిలో కొత్త సభ్యుల పేర్లు చేర్చడం వంటి అంశాలను పరిష్కరించనున్నారు. రేషన్ కార్డుల కోసం ఈ నెల 15 నుంచి దరఖాస్తులను ఆహ్వానించే అవకాశముంది. ఈ మూడు అంశాలపై సీఎం ఉన్నతాధికారులు, కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకాన్ని కూడా వీలైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం సూచించనున్నారు.

**14న ఢిల్లీకి సీఎం రేవంత్**

ఈ నెల 14వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. 15న ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 16న కేంద్రమంత్రులను కలవనున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి వివిధ శాఖల మంత్రులకు వినతిపత్రాలు అందించనున్నారు. అలాగే పార్టీ అగ్రనేతలతోనూ సమావేశం అవుతారు. 17న ఢిల్లీ నుంచి సింగపూర్‌కు బయలుదేరుతారు. రాష్ట్రంలో క్రీడలు, స్టేడియం అభివృద్ధికి సంబంధించి అధ్యయనం చేసేందుకు సీఎం క్రీడల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్, ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. అక్కడి నుంచి దావోస్ వెళతారు. 20 నుంచి 24 వరకు జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనున్నారు. కాగా, రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసు నేపథ్యంలో జప్తు చేసిన పాస్‌పోర్టును ఆరునెలల పాటు తిరిగి ఇవ్వాలన్న అభ్యర్థనను ఏసీబీ కోర్టు అంగీకరించింది.

## జనవరి 26వ తేదీ నుంచి
# ప్రతి రైతుకు రైతు భరోసా

మొదటి పేజీ తరువాయి...

రేవల్లి మండలం తల్పునూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11ఎల ఉపకేంద్రంతోపాటు గోపాల్పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11ఎల విద్యుత్ ఉప కేంద్రాలను ప్రారంభించిన ఆయన పలు గ్రామాలకు నూతనంగా మంజూరైన మరో 7 విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలకు వర్చువల్ విధానంలో వనపర్తి ఆర్డిఓ కార్యాలయం వద్ద జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి గార్లతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు అనంతరం పట్టణంలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ సాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు మొదటగా బుధవారం పుట్టినరోజు జరుపుకున్న స్థానిక ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారికి వారు కేకును కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే 45 కోట్ల రూపాయలు మంజూరు చేశామని ప్రస్తుతం మరో ఏడు విద్యుత్ ఉప కేంద్రాలను నిర్మించేందుకు 23 కోట్ల రూపాయలకు మంజూరు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

గత ఃఖీూ టిఆర్ఎస్ పాలనలో ఒక్క ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసేందుకు లక్షల్లో లంచాలు తీసుకునేవారని నేడు అలాంటి వాటికి తావు లేకుండా ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమను ఏర్పాటు చేయలేదని విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సైతం మొట్టమొదటిసారిగా ఊా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన జ్ఞాపకం చేశారు పదేళ్ల కాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయని నాయకులు నేడు రుణమాఫీ గురించి మాట్లాడడం హాస్యాస్పదం అని ఆయన అన్నారు నేడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు సైతం 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం అందివ్వనుందన్నారుబిరానున్న కాలంలో ప్రతి ఎకరాకు సంపూర్ణంగా సాగునీటిపారుదల చేస్తామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం ఎలా?

మొదటి పేజీ తరువాయి...

న్యాయవాది రాంచందర్‌రావును కూర్చోపెట్టారు. విచారణ పూర్తిగా సీసీ కెమెరాలతో కవర్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. విచారణ ప్రక్రియను ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షించగా జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, అడిషనల్ ఎస్పీ శివరాం శర్మ, సీఐయూ యూనిట్ డీఎస్పీ మాజిద్‌ఖాన్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఫార్ములా–ఈ రేసు ఒప్పందం, క్యాబినెట్ ఆమోదం తీసుకోకపోవడం, డబ్బుల బదిలీ, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, స్పాన్సరర్ కంపెనీతో సాన్నిహిత్యం తదితర విషయాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన ఐఏఎస్ అధికారి దానకిషోర్ వాంగ్మూలం, సహనిందితుడైన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వాంగ్మూలం ఆధారంగా కూడా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది.

**పలు కోణాల్లో ప్రశ్నలు**

ఫార్ములా–ఈ రేసు తొలి ఒప్పందం ఏ విధంగా జరిగింది? దీనికి స్పాన్సరర్‌గా గ్రీన్కో కంపెనీకి చెందిన ఏస్ నెక్ట్స్‌జెన్‌ను ఎందుకు ఎంపిక చేశారు? వారికి క్రీడల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేకున్నా.. వారినే ఎంపిక చేయడానికి కారణాలేమిటి? టెండర్లకు వెళ్లకుండా ఆ కంపెనీకే ప్రత్యక్షంగా అవకాశం ఎలా ఇచ్చారు? చలమలశెట్టి అనిల్‌కు మీకు మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? అనే ప్రశ్నలను కేటీఆర్‌ను అడిగినట్లు తెలుస్తోంది. ఫార్ములా–ఈ కారు రేసు 9వ సెషన్ పూర్తయిన తర్వాత 10వ సెషన్‌కు సంబంధించి స్పాన్సరర్ తప్పుకుంటున్నట్లు మీకు ఎవరు చెప్పారు? త్రైపాక్షిక ఒప్పందం నుంచి స్పాన్సరర్ తప్పుకుంటే ఆ కంపెనీపై చట్టపరమైన చర్యలకు ఎందుకు వెళ్లలేదు? లీగల్ నోటీసు ఇద్దామని పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ చెబితే మీరేమన్నారు? లీగల్ నోటీసు ఎందుకు వద్దన్నారు? అంటూ ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. అయితే, ఈ ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇవ్వకుండా ఎదురు ప్రశ్నలు వేశారని సమాచారం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచటం కోసం తాను ఫార్ములా–ఈ కారు రేసును తీసుకొస్తే అందులో మీరు బొక్కలెతుకుతున్నారని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది.

ఏస్ నెక్ట్స్‌జెన్ విషయంలో నాటి అధికారుల సూచన మేరకే వ్యవహరించానని, ఎఫ్ఈఓతో పురపాలకశాఖ మరో ఒప్పందం చే సుకోవడంలో తప్పేముందని కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం ఎలా తీసుకున్నారని ప్రశ్నించగా, క్యాబినెట్ అనుమతి లేకుండానే ఈ ప్రభుత్వం రేసును రద్దు చేసింది కదా! అని కేటీఆర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పురపాలకశాఖ, ఎఫ్ఈఓ మధ్య ఒప్పందం జరిగితే పురపాలకశాఖ నిధులు వాడాలి కానీ, హెచ్ఎండీఏ నిధులు సుమారు రూ.46 కోట్లు ఎందుకు విదేశీ కంపెనీకి విదేశీ కరెన్సీ రూపంలో పంపించారు అని ప్రశ్నించగా, నిధుల ఖర్చు సంగతి అధికారులదని, విదేశీ కంపెనీకి వెళ్లిన డబ్బు అక్కడే ఉందని వారు చెబుతుంటే ఇక నిధులు దుర్వినియోగం అయ్యింది ఎక్కడ అని కేటీఆర్ బదులిచ్చారు. హెచ్ఎండీఏ నుంచి పది కోట్ల పైన నిధులు తీసుకోవాలంటే ఆర్థికశాఖ అనుమతి తీసుకోవాలి కదా అన్న ప్రశ్నకు.. తనకు ఆ విషయం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద హెచ్ఎండీఏ నుంచి రూ.56 కోట్లు దుర్వినియోగం అయ్యాయి కదా అని ప్రశ్నించగా, సెకండ్ సెషన్ నిర్వహిస్తే బీఆర్ఎసకు పేరొస్తుందన్న కారణంతోనే ఈ ప్రభుత్వం ఆపివేసిందని, ప్రభుత్వానికి నష్టం చేసిన రేవంత్ రెడ్డిపైన కూడా కేసు నమోదు చేయాలని కేటీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన గురించి ప్రశ్నించినపుడు అదంతా ప్రధాన కార్యదర్శి పరిధిలోని అంశమని ఆమెనెందుకు ప్రశ్నించలేదని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది.

**కోడ్ అమల్లో ఉండగా.. నిధుల విడుదలా?**

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నిధుల విడుదలకు ఎలా అనుమతించారని ఏసీబీ అధికారులు ప్రశ్నించగా ఎన్నికల కమిషన్ తమకేమీ లేఖ రాయలేదని, అంతా అధికారులు చూసుకునే వ్యవహారమని కేటీఆర్ బదులిచ్చినట్లు సమాచారం. మొత్తానికి ఏసీబీ విచారణలో చాలా వరకు ప్రశ్నలకు తెలియదు అనే జవాబుతో పాటు.. ప్రశ్నకు ప్రశ్నే కేటీఆర్ సంధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేటీఆర్‌ను ప్రశ్నలు అడిగే సమయంలో ఏసీబీ అధికారులు పలుమార్లు విరామం ఇచ్చారు. అయితే, మళ్లీ మళ్లీ అవే ప్రశ్నలు అడగటంతో ఒక దశలో కేటీఆర్ కొంత అసహనానికి గురై.. 'ఇదొక పనికిరాని కేసు.. నన్ను ఎందుకు వెంటాడుతున్నారు? ఇందులో కొత్తగా బయటపడేది ఏమీ లేదు. మీరు నన్ను అరెస్టు చేయదలచుకుంటే చేసుకోండి. మళ్లీ వేసిన ప్రశ్నలే వేయడం వల్ల ఉపయోగం లేదు' అని చెప్పినట్లు సమాచారం.

**టెన్షన్‌లో కేటీఆర్!**

విచారణ ప్రారంభించినప్పటి నుంచి కేటీఆర్ కొంత టెన్షన్‌గానే ఉన్నారని, పలుమార్లు అధికారులు విరామం ఇచ్చి ప్రశ్నలు అడిగినా ఆయనలో అసహనం కన్పించిందని, లంచ్ టైంలోనూ ముభావంగా ఉన్నారని సమాచారం. విచారణ ముగిసిన తర్వాత మీరు వెళ్లిపోవచ్చు అని ఏసీబీ అధికారులు చెప్పినపుడు కేటీఆర్ ముఖంలో ఆశ్చర్యం, ఆనందం కనిపించిందని.. మంచినీళ్లు తాగి ఆయన ఏసీబీ ఆఫీసు నుంచి బయటకు వచ్చేశారని తెలిసింది.

**సంక్రాంతి తర్వాత మరోసారి విచారణ**

తొలిరోజు విచారణలో ఏమీ బయటపడకపోవడంతో కేటీఆర్‌ను మరోసారి విచారణకు పిలవాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మూడో నిందితుడైన బీఎల్ఎన్ రెడ్డి విచారణ కూడా ముగిసిన తర్వాత కేటీఆర్‌ను సంక్రాంతి పండుగ అనంతరం మళ్లీ పిలవవచ్చని తెలుస్తోంది.

**సుప్రీంలో కేటీఆర్‌కు చుక్కెదురు పిటిషన్‌పై అత్యవసర విచారణకు నిరాకరణ**

**15న విచారణ జరుపుతామని సీజేఐ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, జనవరి 9 : ఫార్ములా–ఈ కారు రేసు కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణమే విచారణ జరిపేందుకు న్యాయస్థానం నిరాకరించింది. శుక్రవారం అత్యవసర విచారణ చేపట్టాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తోసిపుచ్చారు. ముందుగా లిస్ట్ చేసిన ప్రకారం ఈ నెల 15న విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆ తీర్పును సవాల్ చేస్తూ కేటీఆర్ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని న్యాయవాది మోహిత్‌రావు రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్ సీజేఐకి నివేదించడంతో కేటీఆర్ పిటిషన్‌పై విచారణకు ఈ నెల 15వ తేదీని కేటాయించారు. గురువారం మరోసారి కేటీఆర్ న్యాయవాదులు సీజేఐ బెంచ్ ముందు ప్రస్తావించారు. శుక్రవారం విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ.. అత్యవసర విచారణకు నిరాకరించారు.

# మానవుడి భవిష్యత్తు యుద్ధంలో కాదు.. బుద్ధుడిలో ఉంది

## - ప్రవాస భారతీయ దినోత్సవంలో ప్రధాని మోడీ



భువనేశ్వర్ జనవరి 9 : మానవుడి భవిష్యత్తు యుద్ధంలో లేదని .. బుద్ధుడిలో ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా బౌద్ధం స్వీకరించారని గుర్తు చేశారు. గురువారం ఒడిశా లోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18 వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో రష్యా, ఇజ్రాయెల్ పేర్లు ప్రస్తావించకుండా ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. " భారత్ ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం..విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేను చూస్తాను.భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ 20 సందర్భంగా దేశ వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మనవారసత్వ , విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసులుకూడా తోడ్పడ్డారు. ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి. భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం. భారత్‌కు విశ్వబంధువుగా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలి. " అని మోడీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియో సందేశం పంపించారు. ఆమె భారత్ పురోగతిని కొనియాడారు.

**ప్రవాసి భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం**

ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రవాసి భారతీయ ఎక్స్‌ప్రెస్‌రైలును భువనేశ్వర్‌లో గురువారం ఉదయం 10.45 గంటలకు జెండా ఊపి మోడీ రిమోట్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ ఇలా అన్నారు. " మిత్రులారా.. మేం మీ సౌలభ్యం , సౌకర్యానికి చాలా ప్రాముఖ్యత ఇస్తాం. మీ భద్రత,శ్రేయస్సు, మా మొదటి ప్రాధాన్యత. మన విదేశీ భారతీయులు ఎక్కడ ఉన్నా , సంక్షోభ సమయాల్లో వారికి సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. నేటి భారత విదేశాంగ విధానానికి మార్గదర్శక సూత్రాలలో ఇదీ కూడా ఒకటని పేర్కొన్నారు. రాబోయే అనేక దశాబ్దాల వరకు భారత దేశం ప్రపంచం లోనే అత్యంత యువ, అత్యంత నైపుణ్యం కలిగిన జనాభా కలిగిన దేశంగా ఉంటుంది. నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల కోసం ప్రపంచ డిమాండ్‌ను తీర్చగల సామర్థం భారత దేశానికి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలతో సస్యశ్యామలం

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**రాబోయే ఖరీఫ్ పంట నుంచి పంటల భీమా పథకం అమలు**

**తల్లాడ మండలం నూతనకల్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయ భవనం, గోదాంను ప్రారంభించిన మంత్రి తుమ్మల**

ఖమ్మం : గోదావరి జలాలతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని, ఆ దిశగా సీతారామ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మంత్రి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో నాబార్డు నిధులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయ భవనం, గోదాంను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తల్లాడ మండలంతో తనకు చాలా రోజులుగా అనుబంధం ఉందని తెలిపారు. రైతు ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సాగర్ పై లిఫ్టు పెట్టి చివరి భూముల వరకు సాగునీరు తీసుకుని వచ్చామని, చెక్ డ్యాం లు నిర్మించామని, తన చిరకాల కోరిక అయిన గోదావరి జలాలు కూడా రైతుల పొలాలకు త్వరలో రాబోతున్నాయని మంత్రి తెలిపారు. గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు రావాలని తాను ఆకాంక్షించానని, కృష్ణా జలాలు రాని పరిస్థితుల్లో కూడా గోదావరి నీటితో ఖమ్మం జిల్లాలో సాగునీరు అందాలని, ఈ ప్రాంతం పచ్చగా ఉండాలని ఆలోచించి ఎత్తిపోతల ద్వారా ఖమ్మం జిల్లాకు గోదావరిని తీసుకు వస్తున్నామని, ఇటీవలే పెండింగ్ పనులు పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని అన్నారు.

రాబోయే సంవత్సరంలో కృష్ణ జలాలు రావడం ఆలస్యమైనప్పటికీ, గోదావరి నీటితో రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల పరిధిలో సాగునీటికి సంపూర్ణ భరోసా అందించేలా సీతారామ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే సంవత్సరానికి సత్తుపల్లి, వైరా నియోజక వర్గాలకు గోదావరి జలాలు చేరుతాయని మంత్రి తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మొదటి సంవత్సరంలో రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులు ఖాతాలలో జమ చేశామని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రుణాలు తీసుకుని మాఫీ కానీ అర్హులైన రైతులు ఉంటే వివరాలు అందించాలని, వాటికి కూడా రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతో 12 వేల రైతు భరోసా నిధులు రైతు ఖాతాలలో జమ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, రాబోయే రోజులలో మంచి పంటలు పండి రాష్ట్ర ఆదాయం పెరిగితే రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకుంటామని అన్నారు. వివిధ కారణాలతో రైతు మరణిస్తే ఆ కుటుంబానికి వారం రోజులలో 5 లక్షలు చేరే విధంగా రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు.

రాబోయే ఖరీఫ్ పంట నుంచి ప్రతి పంటకు బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. దిగుమతి తగ్గితే, పంట రాని పక్షంలో ఆ లోటును రైతుకు బీమా కంపెనీల ద్వారా భర్తీ చేసే విధంగా పంటల బీమా పథకాన్ని రూపొందిస్తున్నామని అన్నారు.

రైతులు వరి పంట మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్, జాజి, వక్క వంటి పంటలు సాగు చేయాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అవసరమైన మౌళిక వసతులు, గోదాం, పనిముట్లు, తదితరఅందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, పరిపాలన పరంగా రైతులకు వెసలుబాటు ఉండే విధంగా నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ,రైతుల సంక్షేమమే పరమావధిగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నాయకత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ పని చేస్తున్నదని, 2 లక్షల వరకు రైతుల రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలో వస్తాయని, వరి పంటకు మద్దతు ధరతో పాటు, సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ రైతులకు అందడం పట్ల చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా సత్తుపల్లి పరిధిలో యాతాలకుంట వద్ద టన్నెల్ నిర్మాణం ఆగిపోయిందని, ఈ ప్రాజెక్టుపై మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పున ప్రారంభించారని అన్నారు. వైరా నియోజకవర్గానికి ప్రత్యామ్నాయ కాలువ నిర్మించారని తెలిపారు. మలేషియా నుంచి పామాయిల్ సాగు ఆధునిక పద్ధతులను పరిశీలించి ఇక్కడ మన రైతులచే అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, డిసిసిబి సిఇఓ వెంకట ఆదిత్య, పిఏసీఎస్ గంగదేవిపాడు చైర్మన్ తూము వీరభద్రరావు, డైరెక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సైనికుడు కాదు... ఒక యువరాజు

**మరో సారి తెలంగాణ ప్రజలకు చెవిలో పువ్వు పెట్టదు కేటీఆర్**

**కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడు - ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్ : బీఆర్ఎస్ నేతలకు డబ్బు వ్యామోహం లేదంటే ప్రజలు ఎలా నమ్ముతారు. 7 లక్షల కోట్లలో కాంట్రాక్టర్లకు ఎన్ని లక్షల కోట్లు అప్పనంగా ముట్ట చెప్పారు. పాత పాటలు పాడొద్దు కేటీఆర్ గారు కొత్త ముచ్చట చెప్పండి తెలంగాణ ప్రజలు నమ్ముతారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని మీరు జీర్ణించుకోలేకపోతున్నారనేది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. కేటీఆర్, మీరు కేసీఆర్ సైనికునివి కాదు, నువ్వు కె సి ఆర్ కొడుకు వు మాత్రమే. అధికారం కోల్పోయిన యువరాజుకు మతిభ్రమించి మాట్లాడుతున్నాడు. మీ నాయన 2002లో ఏదైతే నినాదంతో వచ్చాడో ఈరోజు మీరు కూడా అదే నినాదం చెబుతున్నారు తెలంగాణ ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరు. దళిత ముఖ్యమంత్రి, ఉద్యోగ నియామకాలు కాపల కుక్కని అని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. మీరు అప్పు చేసిన ఏడు లక్షల కోట్లు సరైన పద్ధతిలో ఖర్చు చేసుంటే కేజీ టు పీజీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా మరియు హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం ఇవన్నీ అందేవి. దళిత ముఖ్యమంత్రిని చేస్తాం,తెలంగాణకు కాపల కుక్కలాగా ఉంటానని అంటే మిమ్మల్ని నమ్మి తెలంగాణ ప్రజలు ఓట్లేశారు. చేసిన ఏడు లక్షల కోట్లలో అప్పులో లక్ష కోట్లు దండుకున్నది మీ కుటుంబమని ఆయన అన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

కాల్వ శ్రీరాంపూర్,జనవరి 09:(ప్రజాకలం ప్రతినిధి) కాల్వ శ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డిఎంఓ.ప్రవీణ్ రెడ్డి,తహసిల్దార్ ఎండి వకీల్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు సంబంధించి 2024 అక్టోబర్,నుంచి



డిసెంబర్,మాసాల ఆదాయ వ్యాయాలు,పశు వైద్య శిబిరం ఏర్పాటు,విజ్ఞాన యాత్ర అంశాలపై చర్చించారు. మార్కెట్ అభివృద్ధిలో భాగంగా మార్కెట్ యార్డ్ లో ఆఫీస్ భవనం,కవర్ షెడ్,మార్కెట్ కమిటీ వెనుక భాగం ప్రహరీ గోడ నిర్మాణం,పై తీర్మానం చేసి,కార్యాలయనికి డేటా ఎంట్రీ ఆపరేటర్, అదనపు సెక్యూరిటీ గార్డ్ పోస్ట్ నియామకాలకు ప్రతిపాదనలు తయారుచేసి డైరెక్టర్ల సమక్షంలో ఆమోదించుకొని ఇట్టితీర్మానాన్ని తెలంగాణ ప్రభుత్వ హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రికి ఆమోదం కొరకు పంపించడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సబ్బని రాయమల్లు,డైరెక్టర్లు కలవేన రాజయ్య,దొమ్మటి రాజయ్య,కదురు మల్లయ్య, ఎనగంటి రవి,సలిగంటి రామచంద్రం,ఎండి అబ్దుల్ రసూల్,దోబీల సంపత్, కోమల మల్లమ్మ,దాగేటి రామచంద్రం,కునారం రమేష్,శివనాత్రి కిషోర్,నార్ల విజయ-రాజయ్య, మార్కెట్ ఇంచార్జ్ కార్యదర్శి ప్రేమ్,ఆషాడపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయిలో శిక్షణ తరగతులు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగి, జనవరి 09, (ప్రజాకలం ప్రతినిధి)

ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఐఐటి, జేఈఈ, నీట్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా లోని 13 కెజిబివి లలో అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఐఐటి, జేఈఈ, నీట్, యూజి ఫౌండేషన్ కోర్సులను ఆన్లైన్ కోచింగ్, లైవ్ క్లాసెస్ చెప్పి, విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వారంతరాల్లో టెస్టులు నిర్వహిస్తారని, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేజీబీవి లలో ఆన్లైన్ క్లాసులు ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. డిల్లీ, హైద్రాబాద్, రాజస్థాన్, కోట లలో ఇచ్చే కోచింగ్, అకాడమీ సౌజన్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారని, ఇప్పటికే డైట్ చార్జీలు 40%,కాస్మోటిక్ చార్జీలు 200% పెంచారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే విద్యార్థులందరికీ ఒకే రకమైన నాణ్యమైన రుచికరమైన పౌష్టిక ఆహారం అందించడానికి ఒకే మెను తయారుచేసి అందిస్తున్నామని వివరించారు. ఉపాధ్యాయులు చెప్పేది వింటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు పోవాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం నాణ్యమైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తుందని తెలిపారు. ఆన్లైన్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. 10వ తరగతిలో 10/10 జి.పి.ఏ సాధిస్తే స్వయానా వచ్చి సన్మానం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభాలత మనోహర్, మాజీ ఎంపిటిసి గడ్డం శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ నర్సారెడ్డి, ఆలయ చైర్మన్ కొమిరె శంకర్, మార్కెట్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



గొల్లపెల్లి జనవరి 09 ప్రజాకలం ప్రతినిధి మండలం కేంద్రంలోని మోడల్ స్కూల్ లో పదవతరగతి చదువుతున్న వర్షిని రాష్ట్రస్థాయిలో బైలాజికల్ సైన్స్ టెస్టులో రెండవ ర్యాంకు సాధించారు. రెండో ర్యాంకు సాధించిన వర్షిని నీ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా కష్టపడి చదివి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థినికి కలెక్టర్ సూచించారు. ప్రిన్సిపల్ సుంకరి రవి ప్రత్యేక చొరవ చూపి విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందుతూ చదువుతో పాటు ఆటపాటల్లో స్థాయి రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతున్నారాన్నారు జిల్లా బయాలజీ సైన్స్ ఫోరం అధ్యక్షుడు రాజగోపాల్ ,జనరల్ సెక్రటరీ తిరుపతి విద్యార్థి నీ ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో డి ఇ ఓ రాము నాయక్ ,ప్రిన్సిపల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, బయాలజీ టీచర్ దయాకర్ రెడ్డి, జిల్లా సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## వెల్గటూర్ మండల కేంద్రం లోని విఎస్ఆర్ గార్డెన్స్ లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

ఎండపల్లి, వెల్గటూర్ జనవరి 09 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల కేంద్రం లోని విఎస్ఆర్ గార్డెన్స్ లో



ఏర్పాటు చేసిన సిఎంఆర్ఎఫ్,కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం రోజున కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 23 లక్షల 47 వేల 5 వందల రూపాయల విలువ గల 69 సిఎంఆర్ఎఫ్ చెక్కులను,49 లక్షల రూపాయల విలువగల 49 కళ్యాణ లక్ష్మీ షాదిముబారక్ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు అనంతరం ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిజేస్తున్నమని గత ప్రభుత్వ పాలకులు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పుల రాష్ట్రంగా మాకు అప్పగించడం జరిగిందని అయినప్పటికీ ఉన్న అప్పులను తీరుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని సాగు చేసుకున్న రైతుకు భరోసా ఇచ్చే విధంగా రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని రైతులకు ఇప్పటికే 2 లక్షల రూపాయల రుణాలు మాఫీ చేయడం జరిగిందని ఇంకా ఎవరికైనా రుణమాఫీ కానీ వారు ఉంటే వారికి రుణాలను మాఫీ చేస్తామని ఇందిరమ్మ ఇండ్లను కూడా గ్రామ సభ నిర్వహించి అర్హులైన లబ్ధదారులకు పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా వాహనాల మళ్లింపు

### - వాహనాల్లో వచ్చే భక్తులకు సూచన సిఐ ఏ రామ్ నరసింహారెడ్డి

ఎండపల్లి, ధర్మపురి జనవరి 09 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలో తేది 10.01.2025 రోజున ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దేవస్థానం వైపు వాహనాలకు అనుమతి లేదు ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి గోదావరి స్నానానికి భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుతుంది కావున గురువారం రోజు అనగా 09.01.2025 రోజు సాయంత్రం 05.00 గంటల నుండి నేడు అనగా 10.01.2025 రోజున సాయంత్రం 05.00 గంటల వరకు బ్రాహ్మణ సంఘం, ఇసుక స్తంభం, నంది చౌరస్తా, వైశ్య సత్రంల నుండి వాహనాలు దేవాలయం వైపుకు వాహనాలు అనుమతించబడవు వాహనాల్లో వచ్చిన భక్తులు తమ యొక్క వాహనాలు నందిచౌరస్తా హరిత హోటల్ సమీపంలో కూరగాయల మార్కెట్ మంగల్ఘాట్ వద్ద, బ్రాహ్మణ సంఘం వద్ద ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలంలో వారి యొక్క వాహనాలు పార్కింగ్ చేసుకుని దైవదర్శనానికి గోదావరి స్నానానికి కాలినడకన వెళ్లాలి ధర్మపురి మండల ప్రజలు తమ యొక్క వాహనాలు దేవస్థానం చుట్టుపక్కల పెట్టరాదని పోలీసు వారు సూచించిన పార్కింగ్ స్థలంలో పెట్టి పోలీస్ వారికి భక్తులు సహకరించగలరని ధర్మపురి సీఐ ఏ రామ్ నరసింహారెడ్డి తెలిపారు.

## మండల విద్యాధికారిచే టిఎస్ యూటీఫ్ క్యాలెండరు ఆవిష్కరణ..



మల్లాపూర్ జనవరి 09 ( ప్రజా కలం ప్రతినిధి) టి ఏస్ యూ టీఫ్ క్యాలెండరు ఆవిష్కరణ మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి రాఘవపేట కాంప్లెక్స్ పాఠశాలలో ఆవిష్కరణ చేశారు. కార్యక్రమం లో భాగంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు విద్య ఫలాలు అందేలా చేయాలన్నారు. మండలాన్ని విద్యలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. మండలంలో విద్యార్థులందరికి నాణ్యమైన విద్య అందించే భాద్యత ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బబ్బురి రాజేందర్ , ఉత్కమ్ నిరంజన్ గౌడ్,ఉపాధ్యక్షులు జరుపుల సుధాకర్,కోశాధికారి సిరిగాని గణేష్ ఎఫ్ డబ్యూ ఎఫ్ కన్వీనర్ వేముల శ్రీనివాస్, రాజమల్లేష్, ఉదయ్ కుమార్, రాజా శేఖర్ బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజుపేటలో గ్రంథాలయం ఏర్పాటు

మంగపేట జనవరి 09 (ప్రజా కలం ప్రతినిధి)

మంగపేట మండలంలో రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యంగ్ స్కాలర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ ములుగు వారి ఆధ్వర్యంలో గ్రంధాలయం ఏర్పాటు చేశారు పింగళి నాగరాజు 25 వేల రూపాయల విలువైన గ్రంథాలయ పుస్తకాలు 30- కుర్చీలు, మూడు రాక్స్ (బీరువాలు)లను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎర్రం సుమతి ట్రస్ట్ చైర్మన్ పింగళి నాగరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు బాలాజీ లు కలసి ప్రారంభించారు. గ్రంథాలయ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ములుగు జిల్లాలో ఉన్న రాజుపేట పాఠశాలకు ఇంత విలువైన పుస్తక బాండాగరాన్ని అందించినందుకు ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు విజ్ఞాన సర్వస్వాన్ని వారి మెదళ్లలో లో నింపడమే ప్రధాన లక్ష్యంగా భావించి ఈ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. కోట్ల విలువైన ధనాన్ని అయినా కొన్ని రోజులకు తింటుంటే కరిగిపో



తుంది కానీ విజ్ఞాన భాండాగారం ఎన్ని రోజులైనా ఎంతమందికి అందించిన తరగదు అనే సదుద్దేశంతో ఏజెన్సీలో అందునా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మీద ఇంతటి అభిమానాన్ని విజ్ఞాన సర్వస్వాన్ని గ్రంథాలయ బండాగారాన్ని అందించాలన్న చక్కటి ఆలోచనతో మంచి లక్ష్యంతో పాఠశాలకు విలువైన పుస్తకాలను అందించినందుకు నాకు చాలా ఆనందాన్నిచ్చింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దయానంద్ యోగ గురువు రాంబాబు పాఠశాల ఉపాధ్యాయులు మద్దెల నాగమణి, శివ నాగేంద్ర ప్రసాద్, శనిగరపు జమున, అనుమ పావని, భూక్యమహాదేవి, దాట్ల పద్మ, వజ్జ సుజాత డి ప్రవీణ్ కుమార్, గుండారపు శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్ చీపురు రామారావు, కారం గణేష్, రసమల సురేందర్, టి ప్రమీల పాల్గొన్నారు.

## చైనా మాంజాపై విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించండి

మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 09 (ప్రజా కలం)చైనా మాంజా వలన గత సంవత్సరం జరిగిన కొన్ని సంఘటనల్లో ప్రాణ నష్టం బాటిల్తోందని ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించేలా గురుకుల సొసైటీ అధికారులు అవగాహన కల్పించాలని మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్ కు ఒక వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఇంటికి వెళ్లే విద్యార్థిని విద్యార్థులకు వారి



తల్లిదండ్రులకు చైనా మంజ పై పేరెంట్స్ మీటింగులో అవగాహన కల్పించాలని కమిటీ బాధ్యులు మెట్ పల్లి ఆర్డీవో కు వినతిపత్రం అందించారు. మాంజాతో జరిగే చెడు పరిమాణాలను వారికి వివరించాలని గురుకుల స్కూలు కాలేజీల్లో విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మెట్ పల్లి ఎంఈఓ ఏం.చంద్రశేఖర్, కూడా వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురుకులల రాష్ట్ర కమిటీ మెంబర్ గోరుమంతుల సురేందర్, మోర్తాటి శ్రీనివాస్ వెలుగు సదానందం, పుల్ల జగన్ గౌడ్, బొండ్ల రమేశ్, డాకూరి వెంకటేశ్, బోల్లి సాగర్. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాల్లో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్ లో ప్రైమరీ విద్యార్థుల ముందస్తు సంక్రాంతి సంబరాలు

పెద్దపల్లి,జనవరి 09:(ప్రజాకలం ప్రతినిధి)పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో ఈ రోజు ప్రైమరీ విద్యార్థులు సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ – రజనీ దేవి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ అంతరించిపోతున్న మన తెలుగు




పండగలు,వాటికి సంబంధించిన సంప్రదాయాలు నేటి తరం పిల్లలకు కూడా తెలియపరచి మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. అందుకనే మా పాఠశాలలో సందర్భానుసారం ప్రతీ పండగను నిర్వహిస్తూ,వాటి యొక్క విశిష్టతను,వాటిని నిర్వహించుకునే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తూ,వారిలో మన సంప్రదాయాల పట్ల అవగాహన ఏర్పరచే క్రమంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు తెలిపి,భోగి పండగ,సంక్రాంతి,కనుమ పండగల విశిష్టతను చక్కగా వివరించి,అందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు మరియు హరిదాసు,గోదాదేవి,గంగిరెద్దుల వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన భోగి మంటల చుట్టూ విద్యార్థినీ విద్యార్థులు,ఉపాధ్యాయినీల బృందం పాటలకు అనుగుణంగా నృత్యం చేయడం అందరినీ ఆకర్షించింది. కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ కూడా పిల్లలలో కలిసి నృత్యం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినీ విద్యార్థులు,పోషకులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీని త్వరగా పూర్తి చేయండి

### - ఏటూరు నాగారం వద్ద స్పైస్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి...

### - రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కోరిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి...

మంగపేట జనవరి 09 (ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ రెండు లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేసి రైతులను రుణ విముక్తులను చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ యం కోదండ రెడ్డి కి జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి విజ్ఞప్తి చేశారు గురువారం నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి పసుపు పరిశోధనా స్థానం సందర్శన కార్యక్రమంలో భాగంగా సాంబశివరెడ్డి కోదండ రెడ్డితో భేటీ అయి వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు రైతు రుణమాఫీ పూర్తికాక రైతాంగం అనేక ఆర్థిక కష్ట నష్టాలను ఎదుర్కొంటుందని రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసేందుకు చివరి విడత నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు ఏటూరు నాగారం వద్ద స్పైస్ పార్క్ ఏర్పాటు చేసి సుగంధ పారిశ్రామిక వాడ ని అభివృద్ధి చేయాలని కోరారు త్వరలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల లో పర్యటనకు రావాలని రైతు కమిషన్ చైర్మన్ మరియు సభ్యులను సాంబశివ రెడ్డి కోరారు ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి సాంబశివరెడ్డి సుగంధ ద్రవ్యాలను బహుకరించారు అనంతరం తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అవినాష్ రెడ్డిని సాంబశివరెడ్డి కలిసి గోవిందరావుపేట తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ప్రాసెసింగ్ ప్లాంటు సందర్శనకు రావాలని అదేవిధంగా తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరి విత్తన ఉత్పత్తి విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమ ంలో వ్యవసాయ, ఉద్యాన అధికారులతో పాటు స్పైసెస్ బోర్డ్ నిజామాబాద్ డిడి సుందరేషన్ విశ్రాంత డిడి డాక్టర్ గాది లింగప్ప తదితర అధికారులతో పాటు వికాస్ అగ్రీ ఫౌండేషన్ వైస్ చైర్మన్ పచ్చిపులుసు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాకలం
శుక్రవారం, జనవరి 10, 2025

# భయం కాదు జాగ్రత్త అవసరం

అదిగో పులి అంటే ఇదిగో తోక అంటూ సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారహితంగా పోస్టులు పెట్టేవారి పుణ్యమాని హెచ్ఎంపివి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. నిజానికి అనేక ఆసియా దేశాలకు ఇది శీతాకాలం. ఇన్ఫ్లూయెంజా, మైక్రోప్లాస్మా, నిమోనియా వంటి వ్యాధులు ప్రబలి, జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ వ్యాధులతో జనం బాధపడటం సహజం. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలూ, పెద్దలూ త్వరితగతిన ఇలాంటి వ్యాధులకు లోనవుతూ ఉంటారు. కోవిడ్ వ్యాప్తి చెందిన తొలినాళ్లలో అవగాహన లేమివల్ల ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ, సరైన నిరోధక చర్యలు చేపట్టడంలోనూ జరిగిన జాప్యం లక్షలాదిమంది ప్రాణాలను బలిగొనడానికి కారణమైంది. మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిస్తే, ఆందోళన చెందడం సహజం. అయితే, గత ఏడాదితో పోలిస్తే తమ దేశంలో హెచ్ఎంపివి కేసులు తగ్గాయంటూ చైనా గణాంకాలతోసహా పేర్కొంటూ ఉండగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇప్పటి వరకూ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించకపోవడాన్ని బట్టి హెచ్ఎంపివి అంత ప్రమాదకరమైన వైరస్ కాదని తెలుస్తోంది. ఈ సూక్ష్మక్రిముల బారిన పడినవారు కోవిడ్ లాగానే శ్వాసకోశ వ్యాధులకు లోనవుతారని తేలినా, ఇప్పటివరకూ దీనికి వ్యాక్సీన్ కనిపెట్టకపోవడం వైద్య ఆరోగ్య శాఖ ఉదాసీన వైఖరికి ఉదాహరణ. కరోనా మహమ్మారి విలయతాండవం సృష్టించి ఐదేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆ పేరు వింటే చాలు వెన్నులోంచి వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మహమ్మారి వైరస్ లక్షలాది మందిని కబళించింది. దీని బారినపడి బతికి బట్టకట్టినవారు ఉన్నా, దాని ప్రభావంతో ఇప్పటికీ పడరాని పాట్లు పడుతున్నారన్నది తోసిపుచ్చలేని నిజం. మళ్లీ అలాంటి వైరస్ ఒకటి వెలుగు చూసిందనీ, మానవాళిని తుదముట్టించేందుకు ముంచుకువస్తోందని తెలిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడా పరిస్థితి ప్రజానీకానికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. కరోనా వైరస్‌కు పుట్టినిల్లయిన చైనాలోనే హెచ్ఎంపివి అనే కొత్తరకం వైరస్ పుట్టి, విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని, దీని బారినపడిన జనం వేల సంఖ్యలో ఆస్పత్రులలో చేరుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా పోస్టవుతున్న వీడియోలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా బెంగళూరులోను, అహ్మదాబాద్‌లోను వెలుగుచూసిందన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో ఎనిమిది నెలలు, మూడు నెలలు వయసున్న ఇద్దరు పసికందులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హెచ్ఎంపివి జాడలు బయటపడ్డాయని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. ఇండియాలోనే కాకుండా, అనేక దేశాల్లో జనావళి ఈ వైరస్ గురించి చర్చించుకోవడం, ఆందోళన చెందడం కొన్ని రోజులుగా జరుగుతోంది. ఇటీవల చైనాలోనూ, తాజాగా బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లోనూ వెలుగు చూసిందని చెబుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపివి) కోవిడ్ లా ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినదేమీ కాదు. దీని జాడలు 2001లోనే నెదర్లాండ్స్‌లో బయటపడ్డాయి. 2018లో ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రిపాలైన చిన్నారుల్లో మూడు నుంచి పది శాతం మంది హెచ్ఎంపివి బారిన పడినట్లు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని బట్టి ఈ వైరస్ ప్రపంచానికి పాతదేనని స్పష్టమవుతోంది. చైనాలో హెచ్ఎంపివి కేసులు పెరుగుతున్నట్లుగా వస్తున్న వార్తలపై తక్షణమే స్పందించి, ప్రపంచ ఆరోగ్య సంస్థను వివరాలకోసం అడగడం భారత ప్రభుత్వం అప్రమత్తతను తెలియజేస్తోంది. దీనికి తోడు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ రంగంలోకి దిగి, జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించి, హెచ్ఎంపివి వ్యాప్తి, నివారణపై తీసుకోవలసిన చర్యల గురించి చర్చించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్యశాఖాధికారులు పలు ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బెంగళూరులో హెచ్ఎంపివి వైరస్ సోకిన ఇద్దరు పసికందుల్లో ఒకరు ఇప్పటికే ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ కాగా, మరొకరిలో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్న విషయం గమనార్హం. పైగా ఈ ఇద్దరికీ విదేశాల నుంచి వచ్చినవారివల్ల ఈ వైరస్ సోకలేదన్న ఆరోగ్య శాఖ ప్రకటనను బట్టి, కోవిడ్ మాదిరిగా హెచ్ఎంపివి ఇప్పటికిప్పుడు చైనా నుంచి దిగుమతైన వైరస్ కాదన్న సంగతి స్పష్టమవుతోంది. వ్యాధులవ్యాప్తి అంతగా లేనప్పటికీ గత కోవిడ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎంపివి వ్యాప్తిని అరికట్టేందుకు చైనా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని అక్కడి అధికార మీడియా వెల్లడించడం ఊరట కలిగించే విషయం. ఏదిఏమైనా, హెచ్ఎంపివి వైరస్ జాడలు మన దేశంలోనూ బయటపడిన నేపథ్యంలో మరింత వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, హెచ్ఎంపివి జాడ కనిపెట్టి, ఈ మహమ్మారిని మొగ్గలోనే తుంచేందుకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. ప్రజలు తమ వంతు బాధ్యతగా స్వీయ రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ఆవశ్యకం.

## డైరీ క్యాలండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,జనవరి 09:(ప్రజాకలం ప్రతినిధి)ఎల్ఐసి డైరీ,క్యాలండర్ లను గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. ఎల్ఐసి ఏజెంట్ పోసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీలు,క్యాలండర్లను జిల్లా కలెక్టరేట్ లో విడుదల చేసి పంపిణీ చేశారు. భీమా రంగంలో యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎల్ఐసి భీమా సంస్థ ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించిందని అభిప్రాయపడ్డారు. పాలసీదారులకు ఎల్ఐసి మెరుగైన సేవలు అందిస్తోందని అన్నారు.

## కష్టపడిన వారినే గుర్తించిన పార్టీ

### - బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా మరోసారి చిలువేరు సంపత్ కుమార్ ఎన్నిక



కాల్వశ్రీరాంపూర్,జనవరి09:(ప్రజాకలం ప్రతినిధి)మండల అధ్యక్షుడిగా మండలంలోని అన్ని గ్రామాలలో 100 శాతం సభ్యత్వం పూర్తి చేసి,అన్ని పోలింగ్ బూత్ కమిటీల నిర్మాణం పూర్తి చేసి, మండలం నుండి 100 క్రియాశీల సభ్యత్వాలను పూర్తి చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందిన చిలువేరు సంపత్ కుమార్ ను పార్టీ గుర్తించి మరోసారి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. మోడీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ ఎమ్మెల్యే,ఎంపీ,ఎలక్షన్లో ముందుండి నడిపించి,బిజెపి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ గతంలో ఏబీవీపీ మండల అధ్యక్షునిగా ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ గా,బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. బిజెపి జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ మొదటిసారి మండల అధ్యక్షునిగా,బిజెపి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి రెండవసారి బిజెపి మండల అధ్యక్షులుగా సంపత్ కుమార్ నియమించారు. ఈరోజు బిజెపి సిద్ధాంతాన్ని నమ్మి క్రమశిక్షణగా పార్టీని ముందుకు తీసుకెళుతున్న చిలువేరు సంపత్ కుమార్ ను రాష్ట్ర పార్టీ మూడవసారి మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ నా నియమకానికి కృషి చేసిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ దుగ్యాల ప్రదీప్ కుమార్,బిజెపి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి,ఎన్నికల ఇంచార్జ్ అయ్యన్న గారి భూమన్న,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ ప్రబారి పోచం,సభ్యత్వాల ప్రముఖు పోల్సాని సంపత్ రావు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్,బిజెపి సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వర్,తాత రవి,ఈర్ల శంకర్ లతో పాటు మండలంలోని బిజెపి నాయకులకు,కార్యకర్తలకు, పోలింగ్ బూత్ అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలపారు.

## బావిలో పడి యువకుడు మృతి



మల్లాపూర్ జనవరి 09 ( ప్రజా కలం ప్రతినిధి) చేపల వేటకు వెళ్లి కాలు జారీ బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది ఎస్సై కోసన రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్ (14) బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బయటకు వెళ్తున్నాను అని చెప్పి ఎవరికి చెప్పకుండా చేపల వేట కు వెళ్ళాడు. ఇంటికి ఎంతకు తిరిగి రాకపోవడం తో తండ్రి రాజం చుట్టుపక్కల వారిని బంధువులను అడిగిన ఆచూకీ లభించలెదు. కార్తీక్ గురించి వెతుకుతూ కదుర్క నరసయ్య వ్యవసాయ బావి దగ్గర చొక్కా, చెప్పులు కనపడటం తో స్థానికులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసు లు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు మృతుడి తండ్రి నేదునూరి రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కొసన రాజు తెలిపారు.

### ఏరువాక కేంద్రం డిఏఏటిసి శాస్త్రవేత్తలు

## ఆయిల్ ఫామ్ పంటల క్షేత్ర సందర్శన



ఎండపల్లి, జనవరి 09 : (ప్రజాకలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూరు, ఎండపల్లి మండలాల్లో ఎరువాకా కేంద్రం ( డి ఏ ఏ టి సి ) కరీంనగర్ నుండి శాస్త్రావెత్తలు సందర్శించారు పైడిపల్లి గ్రామం లో ఆయిల్ పామ్ పంటలు క్షేత్ర సందర్శన లు చేసారు సాగు గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రెండు మండలాల వ్యవసాయ అధికారులు వెల్గటూర్ సాయి కిరణ్, ఎండపల్లి మహేష్ మరియు శాస్త్రవేత్తలు రాజేంద్ర ప్రసాద్, మదన్ మోహన్, వెంకట రమణ ఏ ఈ ఓ లు బలిజపెల్లి సందీప్, మౌనిక, ఫిరదోస్, లావణ్య, స్రవంతి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు మేధాశక్తి దోహదపడతాయి..

### - ముగ్గులు వేయడం ఆరోగ్యానికి మేలు



గోదావరిఖని, జనవరి 09: (ప్రజా కలం ప్రతినిధి)

ముగ్గుల పోటీలు మేదశక్తి దోహదపడతాయని, ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని. వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్.సురభి శ్రీధర్ అన్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శ్రీ లిటిల్ జూనియర్స్ ప్లే స్కూల్ ఆధ్వర్యంలో గురువారం ప్లే స్కూల్ విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి. ముఖ్య అతిథులుగా వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్.సురభి శ్రీధర్, అంజనిపుత్ర ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గుర్రాల సురేష్, పాఠశాల కరస్పాండెంట్ రేణిగుంట తిరుపతి, హాజరై మాట్లాడారు. రంగోలి అనేది సంస్కృత పదం 'రంగవల్లి' నుంచి వచ్చింది. 'రంగ్' అంటే 'రంగు', 'అవల్లి' అంటే 'వరుసలు, గీతలు' అని అర్థం. ఇంటి ముందు ముగ్గు పెడితే మంచి జరుగుతుందని, ఇంట్లోకి అతిథులకు ఆహ్వానించడానికి గుర్తు అని చెప్తుంటారు. ముఖ్యంగా సిరిసంపదలనిచ్చే లక్ష్మీ దేవిని ఇంట్లోకి ఆహ్వానించినట్లు భావిస్తారు అని తెలిపారు. ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ముగ్గులు మహిళలోని మేధాశక్తికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మల దేవి, ప్లే స్కూల్ అధ్యాపకులు సుస్మిత, స్వప్న ,వాణిశ్రీ, సుమలత, మాధవి, అనుష తో పాటు శిరీష, రంజిత్ కుమార్ యాదవ్, వెంకటేష్, కిషోర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



గోదావరిఖని, జనవరి 09: (ప్రజా కలం ప్రతినిధి) గోదావరిఖని 8 ఇంక్లైన్ కాలనీ లో భారత దేశ మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయుల జయంతిసందర్భంగా ఈవీఎస్ ఎన్జీవో ఫౌండేషన్ చైర్మన్ ఇరికి మహేష్ ఆధ్వర్యంలో గురువారం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 8వ కాలనిలో స్పందన మోడల్ స్కూల్ లో ఇద్దరు ముస్లిం టీచర్లకు శాలువాతో సన్మానం చేసి మెమెంటోను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇంకా మార్పు రావాలసిన అవసరం ఉందని, ఫాతిమా షేక్ 1831 జనవరి 09 మహారాష్ట్ర లోని పూణే నగరంలో జన్మించారు అని అలాగే మహాత్మ జోతిబా పూలే, సావిత్రి బయి పూలే దంపతుల సహా ఉపాధ్యాయరాలు గా సూమారు 200 సంవత్సరాల క్రితం ముస్లిం మహిళ గా ఎంతో ధైర్యంగా ముందుకు వచ్చి ఉపాధ్యాయరాలుగా పనిచేయడం అభినందనీయమని, ఆ రోజుల్లో పూణే చుట్టు ప్రక్కల గ్రామాలలో దళితులు, అనగారిని వర్గాలకు సంబంధించిన విద్యా సంస్థల్లో పనిచేసినా ఆదర్శం పాతిమా షేక్ అని, ఆమె సేవాలను గుర్తు చేస్తూ, ఈనాడు సమాజంలో మార్పు రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొతూకురి అవినాష్, ఆరేల్లి ప్రశాంత్, పాశం ఓదేలు, రవీంద్ర, ఉపాధ్యాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర పర్యటనలో ఊషన్నపల్లి పాఠశాల విద్యార్థులు



కాల్వశ్రీరాంపూర్,జనవరి09:(ప్రజా కలం ప్రతినిధి)మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. పాఠశాలకు సమీపంలోని వరి,మొక్కజొన్న,పసుపు,పత్తి,కంది,కొత్తిమీర, పుదీనా, టమాట,బొప్పాయి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలు వివిధ పంటల రకాలు వాటిని పండించే విధానాలను తెలుసుకున్నారు. పొలంలో వరి నాట్లు వేస్తుండగా,వరి నాటు వేసే విధానాన్ని పరిశీలించారు. పొలంలో దిగి,ఆనం దంతో పరవశించిపోయారు. క్షేత్రస్థాయిలో బొప్పాయి,పత్తి,పసుపు, మొక్క జొన్న,వరి పంటల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య విద్యా ర్థినీ, విద్యార్థులకు వివరించారు. ప్రత్యక్షంగా పంటలను పరిశీలించిన పాఠశాల పిల్లలు మెక్కులు సంతోషపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, బండారి స్రవంతి,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు అందరి భాధ్యత

### - ఎస్సై శ్రీధర్ రెడ్డి

బుగ్గారం ప్రజాకలం ప్రతినిధి జనవరి 09: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పౌరుడు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవు అని స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పి హెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత మాస ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్డు భద్రత విషయాలలో పాటించవలసిన నియమాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండని విద్యార్థులు వాహన నడుప రాదని ఇతరులు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించాలని, ఎట్టి పరిస్థితుల్లో తాగి వాహనాలు నడపవద్దని, అదేవిధంగా ఆజాగ్రత్తగా మరియు సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి యువత విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ప్రతి ఒక్కరు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం 1998 -1999 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను ఎస్సై ప్రారంభించాడు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రహమాన్, పోలీస్ కానిస్టేబుల్స్ ప్రవీణ్ కుమార్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## పాలకుర్తి అంతర్గాం ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం..

### - ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారికి అందజేయడం లో కీలకంగా వ్యవహరించాలి

### - రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



గోదావరిఖని, జనవరి 09: (ప్రజా కలం ప్రతినిధి)

ఎన్టీపీసీ మిలీనియం హాల్ లో జరిగిన పాలకుర్తి, అంతర్గాం మండలాల అధికారులతో గురువారం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలకుర్తి, అంతర్గాం మండల పరిధిలో ఉన్నటువంటి ప్రజలకు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రభుత్వ పథకాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అమలు అవుతున్న 6 గ్యారెంటీల లబ్ధి పొందుతున్న ప్రజల ఆలోచన విధానం ఏవిధంగా ఉంది అని అధికారులను అడగడం జరిగింది. జనవరి 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్న తరుణంలో అర్హులైన పేదల అందరికి ఈ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులకు తగు సూచనలు చేశారు. పాలకుర్తి, అంతర్గాం మండలం వివిధ గ్రామాలలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదేవిధంగా గ్రామాల ప్రజలు మండల స్థాయి నాయకులు సమస్యలపై అధికార కార్యాలయానికి అభివృద్ధి కార్యక్రమాల విషయంలో వచ్చిన వారికి పూర్తి స్థాయిలో సహకరించి పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెండు మండల ఉన్నత అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి అండగా తోటి ఉద్యోగులు



జగిత్యాల ప్రజాకలం ప్రతినిధి జనవరి 9 : గొల్లపల్లి మండలం బీబీ రాజు పల్లి గ్రామం పంచాయతీ కార్యదర్శి గా పని చేసిన రాసమల్ల తిరుపతి ఇటీవల మరణించినందున వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మృతుని కుటుంబానికి మేము ఉన్నాం అంటూ భరోసా ఇస్తూ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య సంఘం జగిత్యాల ద్వారా విరాళం గా (100000) ఒక లక్ష రూపాయలు ను జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గౌతమ్ రెడ్డి,డిపిఓ మదన్ మోహన్ చేతుల మీదుగా వారి కుటుంబానికి గురువారం రోజున అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి, ఎంపీ ఓ రవి బాబు,గొల్లపల్లి ఎంపీ ఓ సురేష్ రెడ్డి, జగిత్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శిల సంఘం అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్, కోశాధికారి సతీష్ కుమార్ మరియు సభ్యులు కొమురయ్య, రవిరాజు,రాజిరెడ్డి, రవీందర్ మరియు కార్యదర్శులు పాల్గొన్నారు.

## మల్యాలపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎం ఈ ఓ గడ్డం చంద్రయ్య..



గోదావరిఖని, జనవరి 09: (ప్రజా కలం ప్రతినిధి) మల్యాలపల్లి లోని ప్రభుత్వ పాఠశాలను గడ్డం చంద్రయ్య గురువారం సందర్శించారు. పిల్లలతోపాటు ఎం ఈ ఓ ప్రతిజ్ఞ ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులను తరగతుల కు సంబంధించిన విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎంఈ ఓ మాట్లాడారు. ఒకటో తరగతి నుండి 9వ తరగతి చదివి విద్యార్థులకు చదవడం రాయడం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధ్యాపకులకు సూచించడం జరిగిందని తెలిపారు. పదో తరగతి పరీక్షలు రానున్న సందర్భంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వపరంగా అన్ని వసతులు ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని పనిచేసే అధ్యాపకులు సమయపాలన పాటించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి తో పాటు ఉపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సులభ్ కార్మికులకు పెండింగ్ బోనస్ ఇచ్చిన సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు

**- సులభ్ కార్మికులను గుర్తించిన యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు**



గోదావరిఖని, జనవరి 09: (ప్రజా కలం ప్రతినిధి)
సింగరేణి యాజమాన్యం సులబ్ కార్మికులకు కూడా 5000 రూపాయల లాభాల బోనస్ ఇచ్చి సులభ్ కార్మికులను గుర్తించినందుకు గాను సింగరేణి సులభ్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం ఆర్ జీ వన్ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, శ్రీహర్ష అకౌంట్ సెక్షన్ ఆఫీసర్, డీజీఎం సివిల్ వర ప్రసాద్ లకు సన్మానం చేసి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నాయకులు శనిగల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తాము చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించి సులభ కార్మికులను గుర్తించి వారికి 5000 రూపాయలు ఇచ్చినందుకు సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సింగరేణి యాజమాన్యం సులబ్ కార్మికులుగా గుర్తించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు కూడా తెలిపారు. అదేవిధంగా వీరికి వైద్య సదుపాయం అందించాలని సిఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇంకా కార్యక్రమంలో ఏరియా శానిటరీ ఇన్స్పెక్టర్ గంట శ్రీనివాస్, మనోజ్ కుమార్, సులబ్ కార్మికులు దామోదర్, రాజయ్య,చంటి,మల్లేశ్వరి,సతీష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేత

మధిర జనవరి 9( ప్రజా కలం న్యూస్) మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ నుంచి మంజూరైన చెక్కులను మండల పరిధిలోని మహదేవపురం గ్రామానికి



చెందిన బాడిశ నాగమణి, మర్లపాడు గ్రామానికి చెందిన వేల్పుల వనజాక్షికి మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కునేందుకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని సద్వినియోగ పంచుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దార బాలరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ,పులి బండ్ల చిట్టిబాబు, సేవదళ్ అధ్యక్షులు ఆదూరి శ్రీనివాస్, రావిరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యుల అరెస్టు

హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి

ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 06 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి తెలిపారు.సుబేదారి పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి దేవేందర్ రెడ్డి, సుబేదారి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తో కలిసి వివరాలను వెల్లడించారు.గురువారం అదాలత్ సెంటర్ వద్ద సుబేదారి సబ్ ఇన్స్పెక్టర్ గాలిబ్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా వెళ్తుండగా వారిని పట్టుకుని విచారించగా హనుమకొండ మచిలీ బజార్ మరియు పరకాల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మునుకుల అఖిల్, మునుగుల అభిరామ్,ముస్కుల సిద్ధార్థ,మునకల మధుసూదన్ సుబేదారి,కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాంనగర్, సాయి నగర్,బాల సముద్రం,భవాని నగర్,నయీమ్ నగర్,అమరావతి నగర్ ప్రాంతాలలో రాత్రి సమయాలలో ఇళ్లల్లో ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి వాటిని అమ్మి వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు.అరెస్టు చేసిన నలుగురు నిందితుల నుండి 4,60,000 విలువగల (6)ద్విచక్ర వాహనాలను 3 సెల్ ఫోన్ల స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. నిందితులను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీన చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి. ఇన్స్పెక్టర్ గాలిబ్, ఏఎస్ఐ పాపయ్య, హెడ్ కానిస్టేబుల్ రోషన్ అలీ, కానిస్టేబుల్ అఖిల్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు రామారావు, ఫణి, ఘాలిబ్ లు పాల్గొన్నారు.

**ఊరెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి.. హనుమకొండ ఏసీపీ**

సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు





తీసుకోవాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి సూచించారు.తాళం వేసిన ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు.పండగకి ఊరికి వెళ్లే వారు ఇరుగు,పొరుగు సమాచారం ఇవ్వడంతో పాటు మీ విలువైన వస్తువులను ఇంట్లో పెట్టకూడదని అలాగే ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఏసిపి దేవేందర్ రెడ్డి అన్నారు.

## ఖాళీ అవుతున్న అవ్వ గారి చెరువు

**- ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు విడుదల చేయాలని కోరుతున్నరైతులు**



జనవరి 09, ప్రజాకలం ప్రతినిధి. ( వరంగల్/ పర్వతగిరి )

పర్వతగిరి మండల కేంద్రంలోని అవ్వ గారి చెరువు ఖాళీ అవుతుందని, వెంటనే ఎస్ఆర్ఎస్పి కెనాల్ నీళ్లను చెరువులోకి వదలాలని రైతులు కోరుతున్నారు. అలాగే మండల పరిధిలోని కల్లెడ గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆవకుంట లోని నీరు కూడా అడుగంటి పోయాయని సంబంధిత అధికారులు మండల కేంద్రంలోని అవ్వ గారి చెరువు నింపి కట్టు కాల్వ ద్వారా ఆవకుంటలోకి నీరు వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

**ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి:**



పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన చిరబోయిన రాజు మత్స్యశాఖ సభ్యుడు మాట్లాడుతూ మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవ్వ గారి చెరువును కౌలుకు తీసుకున్నానని, ప్రభుత్వము అందించిన చేప పిల్లలతో పాటు బయట కొనుగోలు చేసిన చేప పిల్లలను కూడా చెరువులో వదిలానని, చేపల సైజు పెరగకముందే చెరువులో నీరు ఖాళీ అవడం ఆందోళన కలిగిస్తుందని, అలాగే చెరువు శివారు రైతులు కూడా నీటికి ఇబ్బంది పడవలసి వస్తుందని, వెంటనే సంబంధిత అధికారులు ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లను చెరువులోకి విడుదల చేయాలని కోరాడు.

**చెరువు నింపి కట్టుగాల ద్వారా నీరు విడుదల చేయాలి:**

మండల కేంద్రానికి చెందిన రైతు కొల్లూరి స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వము ఈ ప్రాంత రైతులను దృష్టిలో పెట్టుకొని



దాదాపు 20 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి, కట్టు కాలువ పనులు చేపట్టడం జరిగిందని, గత సంవత్సరం అవ్వగారు చెరువు నింపి, కట్టుకాల్వ ద్వారా నీటిని కల్లెడ శివారులోని ఆవకుంటకు నీటిని వంపడం ద్వారా ఆవకుంట రైతులతోపాటు, దాదాపు కిలోమీటర్ కలిగిన కాలువ ఇరుప్రక్కల బోరు బావులలో నీరు పెరిగి, రైతులకు ఇబ్బంది లేకుండా పంటలు పండించుకున్నామని అన్నాడు. ఈ సంవత్సరం కూడా ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని అవ్వగారు చెరువును నింపి, కట్టు కాల్వ ద్వారా నీళ్లను విడుదల చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నాడు.

## పేకాట స్థావరాలపైన జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు

**- జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఐపీఎస్**

వికారాబాద్ జనవరి 09(ప్రజాకలం ప్రతినిధి ):

జిల్లా ఎస్పీ కె నారాయణ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు ఆద్వర్యంలో జిల్లా లోని నవాబ్ పేట్ మరియు బషీరాబాద్ పోలీస్ ల పరిధిలలో ఉన్న పేకాట స్థావరాలపైన జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా మొత్తం 2 పేకాట కేసులు నమోదు చేసి (25) మందిని అదుపులోకి తీసుకోని 3,81,830 /- రూపాయలు, 27 సెల్ ఫోన్స్ సిజ్ చేయడం జరిగింది.అట్టి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నవాబుపేట పిఎస్ పరిధిలోని గంగ్యాడ గ్రామ శివారులో ఉన్న మల్లేశం ( గంగ్యాడ మాజీ సర్పంచ్) ఫామ్‌హౌస్‌లో పేకాట స్థావరం పైన దాడి చేసి పేకాట ఆడుతున్న 20 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుండి 3,26,510/-రూపాయల నగదు,22సెల్ ఫోన్‌లు,05 కార్లు 06 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది.ఇట్టి విషయం పైన నవాబ్



పేట్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగింది. బషీరాబాద్ పీఎస్ పరిధిలోని బషీరాబాద్ మండలం నవాల్గ గ్రామంలో జిల్లా టాస్కోఫ్ఫర్స్ బృందం పేకాట స్థావరం పైన దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదు గురు వ్యక్తులను పట్టుకొని వారి నుండి 55,320/- రూపాయల నగదు మరియు 05 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగింది.జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడిన, ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా లు చేసిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని జిల్లాఎస్పీ నారాయణ రెడ్డి తెలిపినారు. ఈ కార్యక్రమం లో టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు,నవాబుపేట ఎస్సై కే. అరుణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పామాయిల్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు వ్యవసాయ శాఖ అధికారులు.

పాలేరు జనవరి 09 (ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండలం పరిధిలోని గురువారం కిష్టాపురం గ్రామంలో రైతులకు పామాయిల్ పంట సాగుపై మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల్లో పామ్ ఆయిల్ సాగు ప్రాధాన్యత సంతరించుకున్నదని, కావున రైతులందరూ ఈ పంట సాగు చేసేందుకు మొగ్గు చూపాలని కోరారు. నీటి వసతి బాగా ఉన్న ప్రాంతాలలో ఈ పంటను సాగు చేసుకోవచ్చని, ఒక ఎకరం వరి సాగు చేయడానికి సరిపడా నీటితో మూడు ఎకరాల పామాయిల్ పంటను సాగు చేయవచ్చు అని తెలియజేయడం జరిగింది. పామాయిల్ పంట వేసిన నాలుగో సంవత్సరం నుండి 20 ,25 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందని, మొక్కలు, డ్రిప్పు మొదలైనవి సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం సాగు చేస్తున్న వరి, పత్తి ,మిర్చి వంటి పంటలలో ఎదురవుతున్న కూలీల సమస్యను కూడా అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం . ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 11,12 తేదీలలో క్రెడాయి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో..

హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి హనుమకొండలో క్రెడాయి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో జనవరి 11,12 తేదీలలో జిఎంఆర్ గార్డెన్ 100 ఫీట్ల రోడ్డు లో నిర్వహిస్తున్నామని క్రెడాయి వరంగల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి తెలిపారు. హనుమకొండలోని క్రెడాయి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన




మీడియా సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా ఇల్లు లేదా విల్లా అపార్ట్మెంట్ కొనుగోలు చేయాలనుకునేవారు సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి సౌకర్యంగా ఉండేందుకు నగరంలో నిర్మాణం అవుతున్న అన్ని అపార్ట్మెంట్స్,విల్లా, లేఔట్ సమాచారంతోపాటు ఇంటి నిర్మాణానికి కావాల్సిన ప్రోడక్ట్ అన్ని తెలుసుకోవడానికి లోన్స్ సౌకర్యం కోసం వివిధ బ్యాంకులను ఒకే వేదికపై నిర్మించి ప్రాపర్టీ షో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ఈ అవకాశాన్ని హనుమకొండ,వరంగల్, కాజీపేట నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అతి తక్కువ ధరలో ప్రజలకు నాణ్యమైన సరసమైన ప్రాపర్టీని అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు అమరేందర్ రెడ్డి, అమరలింగేశ్వరరావు,రవీందర్ రెడ్డి, సెక్రెటరీ మనోహర్,జాయింట్ సెక్రెటరీ రాజేందర్ రెడ్డి,మెంబర్లు నాగరాజ్ హరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి..

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని రోడ్డు భద్రతా మాసోత్సవాల కమిటీ చైర్మన్,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1 నుండి 31 వరకు రోడ్డు భద్రతా మాస ఉత్సవాల అవగాహన కార్యక్రమాలను




నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని,అందుకు జిల్లాలో జనవరి 31 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాస ఉత్సవాల ఏర్పాటుకు రోడ్డు అండ్ బిల్డింగ్స్ అధికారి నిర్దేశించిన ఆయా శాఖల అధికారులు చేయవలసిన విధివిధానాలనుహొహొరూపొందించిన యాక్షన్ ప్లాన్ తయారు చేసి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలు మరియు మరణాలలో 75% నుండి 80% డ్రైవర్ల తప్పిదాల వల్ల సంభవిస్తాయని పేర్కొన్నారు. అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం మరియు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయనిహొ వాటినిహొ నియంత్రించడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డిసిపి రవీందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జైపాల్ రెడ్డి,డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి,సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక జనవరి 09బీ ఎటపాక మండలంలోని గన్నవరం లో సీసీ రోడ్డుకు శంకుస్థాపనకు సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉప సర్పంచ్



కందుకూరి స్వర్ణ, ఎంపీటీసీ కంటె రాజు, కొబ్బరీ కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామ పరిదిలోని స్థానిక రైటర్ రామారావు, మూలిశెట్టి వారి వీధి, వసంతాల వారి వీదికి ఎంపిపి నిధులు ద్వారా రోడ్డు మంజూరు చేయడంతో రోడ్డు మంజూరు చేసినందుకు గ్రామ పంచాయితీ వారికి కాలని వసూలు హర్షంవ్యక్తంచేశారు. ఈ సంధర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని మిగతా అన్నీ కాలనీ వాసులకు రోడ్లు, డ్రైనేజీ కోసం ప్రణాళికలు పంపామని మంజురు కాగానే త్వరలోనే పనులు ప్రారంబిస్తామన్నారు. గ్రామ పంచాయతి అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచయితీ సెక్రటరీ వేంకటేశ్వర్లు, ఏ ఈ ఎర్రయ్య, సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు వల్లభనేని సత్యనారయణ పాల్గొన్నారు.

# ప్రజా కలం క్యాలెండర్ ఆవిష్కరణ



## క్యాలెండర్ ను ఆవిష్కరించిన ప్రముఖ చాతి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ వర్మ

హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి

హనుమకొండ ములుగు రోడ్ లోని వర్మ చెస్ట్ హాస్పిటల్లో ప్రజా కలం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ప్రముఖ చాతి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ వర్మ.. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుగులోకి తీసుకువస్తున్న ప్రజా కలం యజమాన్యానికి డాక్టర్ శ్రీనివాస్ వర్మ అభినందనలు తెలిపారు.

నిరంతరం ఇలాగే ప్రజల వారధిగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా పత్రిక ఉండాలని అన్నారు. అలాగే సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాలెండర్ ను ఆవిష్కరించిన హనుమకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి

హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్లో ప్రజా కలం తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలండర్ ను వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ అనిల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన హనుమకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి..అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా కలం దినపత్రిక తెలుగు రెండు రాష్ట్రాలలో మంచి సర్క్యులేషన్ ఉన్న పత్రికగా,ప్రజా కలం పత్రిక ప్రజలకు వారధిగా నిలుస్తున్న పత్రిక అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ రెడ్డి,ఎస్సైలు రామారావు,ఫణి,ఘాలిబ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## హనుమకొండ నగరంలో నూతన గోద్రెజ్ జెర్సీ మిల్క్ పార్లల్..



హనుమకొండ జనవరి 9 ప్రజా కలం ప్రతినిధి హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని వడ్డేపల్లి ప్రాంతంలో గురువారం రోజు ఉదయం గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో జెర్సీ మిల్క్ పార్లల్ లో కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ ఏరియా సేల్స్ మేనేజర్ విజయ్ కుమార్ ఏరియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ గడ్డం అనిల్ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటర్స్ శ్రీనివాస్ సాత్విక్ పాల్గొని మిల్క్ పార్లల్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ జెర్సీ పాలు స్వచ్ఛమైనవి వీటిలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని కస్టమర్లకు అందుబాటులో సరసమైన ధరలకు పాలు పెరుగు పన్నీర్ బట్టర్ మిల్క్ లస్సి వెయ్యి బాదం పాలు వంటి రకరకాల మిల్క్ ప్రొడక్షన్ ఈ పార్లర్ లో అందుబాటులో ఉంచి కస్టమర్లకు హొమ్ డెలివరీ సదుపాయాన్ని కూడా కలిగిస్తూ కంపెనీని ముందుకు నడిపిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కంపెనీ డీజీఎం,ఏ ఎస్ ఎం,ఏసీఇ,డిస్ట్రిబ్యూటర్లతోపాటు ప్రమోటర్లు కస్టమర్లు పాల్గొన్నారు.

## కలకొడిమ ఆలయంలో నవగ్రహాల నిర్మాణానికి 30వేలు వితరణ..

### దాతలను సన్మానించిన ఆలయ చైర్మన్ దిరిశాల దాసురావు దంపతులు..



తల్లాడ జనవరి 9( ప్రజా కలం న్యూస్ ): తల్లాడ మండలంలోని కలకొడిమ గ్రామంలో కలకొడిమేశ్వర రామాలయంలో నవగ్రహాల నిర్మాణానికి గురువారం దాతలు వితరణ అందించారు. కుర్నవల్లి గ్రామానికి చెందిన శీలం రాఘవరెడ్డి, వాణి దంపతుల కుమార్తె ప్రముఖ ఎన్నారై భావన 30వేలు వితరణ అందించారు. ఈ నగదును ఆలయ కమిటీ చైర్మన్ దిరిశాల దాసురావు, తల్లాడ మాజీ జడ్పిటిసి దిరిశాల ప్రమీల దంపతులకు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసురావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ముందుకొచ్చిన దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో ఆలయం అభివృద్ధి కోసం దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించాలని కోరారు. అనంతరం దాతలను ఆయన శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దిరిశాల చిన్న నరసింహారావు, చింతనిప్పు భద్రయ్య, షేక్ హుస్సేన్, దిరిశాల వెంకటయ్య, వడ్డే కృష్ణవేణి, చెరుకుమల్లి పుష్పావతి, వడ్డే వెంకటయ్య, యలుగోటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి మండల కేంద్రంలో ఘనంగా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుక.



పాలేరు జనవరి09( ప్రజా కలం న్యూస్)కూసుమంచి మండల కేంద్రంలో గురువారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, జన్మదిన సందర్భంగా కూసుమంచి మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుక నిర్వహించి టపాసులు కాల్చి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ నాయకులందరూ కలిసి హైదరాబాదు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఏకైక ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు మాజీ జడ్పీటీసీలు , స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పాలేరు జనవరి09( ప్రజా కలం న్యూస్) పాలేరు గురువారం తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ గురువారం జరిగింది. ఈ చెక్కులను లబ్దిదారులకు క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అందజేశారు. మొత్తం 26మంది లబ్దిదారులకు రూ. 6.69 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సంఘాలకు 802 కోట్ల రుణాలు అందించడమే లక్ష్యం



నాగిరెడ్డిపేట్ జనవరి9 ప్రజాకలం

జిల్లాలో ని గ్రామ సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో 802 కోట్ల రుణాలు అందించడమే లక్ష్యమని డీ ఆర్ డీ వో డీ పీ ఎం సుధాకర్ తెలిపారు. ఆయన గురువారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ని సెర్ఫ్ కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం పడాది కారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 17 వేల 58 సంఘాలుండగా 1లక్ష 78 వేల సభ్యులున్నారని తెలిపారు. ఈ సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో 802 కోట్ల రూపాయల రుణాలు అందించాలన్న లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు 613 కోట్ల రుణాలు అందించి 76 శాతం లక్ష్యం సాదించామన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ సంఘాలలో ప్రతి సభ్యురాలు తప్పనిసరిగా తమ సభ్యత్వాన్ని రేనివల్ చేసుకోవాలని సూచించారు. రేనివల్ చేసుకున్న సభ్యురాలికి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఒక సంఘంలో 10 మంది సభ్యులుంటే 5 గురు పడాదికారులను ఎన్నుకుంటారని వీరికి 5 సంవత్సరాలు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. ద్వాక్ర మహిళలను పారిశ్రామిక వేత్తలు గ తీర్చి దిద్దడం కోసం ప్రభుత్వం సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జల్లాలో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం 150 ఎకరాలు లో భూ సేకరణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం 4 ఎకరాలు భూమి అవసరం ఉంటుందని అన్నారు. సోలార్ ఏర్పాటు కోసం 3 కోట్ల రూపాయల వెచ్చిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో10 శాతం సంఘాలు కంట్రిబ్యూషన్ చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఎం జగదీష్ కుమార్,ఐకేపీ అధ్యక్షురాలు శాంత సీ సీ లు పాల్గొన్నారు.

## మధిర పట్టణ పరిధిలో జిలుగుమాడులో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, లింగాల కమల్

మధిర జనవరి 9( ప్రజా కలం న్యూస్)

మధిర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజుమొదటిగా వీరం శెట్టి సీతారామయ్య సతీమణి అస్వస్థతతో ఉండడంతో వారిని పరామర్శించారు. అనంతరం యెన్నం కోటేశ్వరరావు తండ్రి యెన్నం వెంకట్రావు



అస్వస్థతతో ఉండడంతో వారిని పరామర్శించారు. అనంతరం చిన్నం కృష్ణకుమారి అస్వస్థత ఉండడంతో వారిని పరామర్శించారు. అనంతరం ముక్కు కొండా చేయి ఇటీవల విరుగగా వారిని పరామర్శించారు.? ఈ పరామర్శలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ యెన్నంశెట్టి అప్పారావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, పట్టణ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, ఆళ్ల నాగబాబు, పరీషా శ్రీనివాసరావు, నాగులవంచ రామారావు, చీరాల రాంబాబు, ఖురేషి, మీరా, దోర్నాల కోటేశ్వరరావు,రంకేమల్ల నాగేశ్వరావు, గాలి నాగేశ్వర్రావు, వీరంశెట్టి కృష్ణ, కొంగల దేవదాసు తదితర, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## బడుగు బలహీన వర్గాల అభివృద్దే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు అనిల్ గౌడ్

సిద్దిపేట జిల్లా

ప్రజాకలం ప్రతినిధి జనవరి 07.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్ గ్యారెంటీలు అమలు చేస్తామని, హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేసిందని రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు అన్న బోయిన అనిల్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్



ప్రభుత్వంలో గృహ జ్యోతి, మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు రుణమాఫీ, అర్హులైన వారికి సొంతింటి జాగా ఉన్నవారికి ఇల్లు మంజూరు చేస్తుందని ఇప్పటికే సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఈనెల 15 నుండి కొత్త రేషన్ కార్డులకు గ్రామ సభ పెట్టి రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధంగా ప్రభుత్వం ఉందని అన్నారు. రైతులకు జనవరి 26 నుండి రైతు భరోసా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు.

## ఎం.ఎల్.ఏ మూఠ గోపాల్ గారిచే నూతన కాలమానిక ఆవిష్కరణ

హైదరాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జనవరి 09:

పెద్దపెల్లి జిల్లా మంథని మండలం, శ్రీగంగాదేవి దేవస్థానం బెస్తపల్లి గ్రామం, గంగపుత్రల మత్స్యకారుల కులదైవం శ్రీగంగాదేవి అమ్మవారు నూతన క్యాలెండర్ – 2025 ఆవిష్కరణ జరిగింది. తమ జాతికి చెందిన కాలమానిక స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ గంగపుత్ర గారి శుభ హస్తములచే హైదరాబాదు నగరంలోని శ్రీగంగాదేవి నిత్య దీపారాధన కమిటీ రూపొందించిన క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. ఈ క్యాలండర్ ఉచితంగా పంపిణీ జరగనున్నదని కమిటీ



నాయకులు తెలియజేశారు. అయితే ఇది తమ కుల సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడం కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో శ్రీగంగాదేవి నిత్య దీపారాధన కమిటీ, బెస్తపల్లి దుబ్బపల్లి చందనాపూర్ సభ్యుడు మేడి లక్ష్మణ్ గంగపుత్ర,గంగపుత్ర మత్స్యకార సంఘాల నాయకులు, తెలంగాణ రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు కొప్పు లక్ష్మీనారాయణ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

### - 54 మందికి వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డి జనవరి 09 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం జిల్లా అందాత్వ నివారణ సంస్థ, లయన్స్ కంటి ఆసుపత్రి బాన్సువాడ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మోతి బిందు నిర్ధారణ శిబిరం నిర్వహించినట్లు సుపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కంటి వైద్య శిబిరంలో మొత్తం 54 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించా మన్నారు. వీరిలో 9 మందికి మోతి బిందు ఉన్నట్టు గుర్తించి, శస్త్ర చికిత్స కోసం వీరిని బాన్సువాడ లయన్స్ ఆసుపత్రికి పంపించా మన్నారు. మరో 22 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి వారికి కంటి అద్దాలు సిఫారసు చేసామన్నారు. మరో ఇద్దరు రోగులకు కంటిలో తెల్లపువ్వు ఉన్నట్టు గుర్తించి వారిని చికిత్స కొరకు హైదరాబాద్లోని సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి పంపామన్నారు. మిగతా వారికి



చిన్న చిన్న కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణి చేశామన్నారు. ప్రతి గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వైద్య శిబిరంలో నేత్ర వైద్య సహాయ అధికారి హరికిషన్ రావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఫాతిమా షేఖ్ జయంతి వేడుకలు...

ఎల్లారెడ్డి జనవరి 09 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం భారత దేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేఖ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫత్ ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫాతిమా షేఖ్ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ సి బాలరాజ్, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, మాంజూర్ ఖాన్, ఖాజా,నాగరాజు, దత్తాత్రేయ, నవీన్ కుమార్, శివ ప్రసాద్, ఫర్హాన , రిజ్వన, శ్రీదేవి, అనురాధ, జ్యోతి, నాగరాజు, సంతోష్, బాలమణి, సయ్యద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడానికి

# పత్రికలు కృషి చేయాలి

### ప్రజా కలం పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్

మహేశ్వరం, జనవరి 09,(ప్రజా కలం)



ప్రజా కలం పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్



ప్రజా సమస్యలు పరిష్కరించడానికి పత్రికలు కృషి చేయాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ తుక్కుగూడ మున్సిపల్ లో ప్రజా కలం పత్రిక క్యాలండర్ ను తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ కౌన్సిలర్లతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పత్రికలు నిలవాలని చైర్మన్ అన్నారు. సమాజంలో ఎన్నో సమస్యలను వెలికి తీస్తూ తెలియని విషయాలు ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు నాయకులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అందరి సమస్యలు పరిష్కరించే విధంగా ఉండాలని చైర్మన్ కోరారు.ఈ మున్సిపల్ కౌన్సిలర్స్ శివకుమార్ గౌడ్, బోధ యాదగిరి రెడ్డి, జపాల భవనా సుధాకర్ ,ప్రజా కలం రిపోర్టర్ తడక నర్సింహా ,పాశం ప్రసన్న గౌడ్ పాల్గొన్నారు.

# తండాలను గ్రామపంచాయతీలు గా చేసిన ఘనత కేసీఆర్ దే

### పడమటి తండా గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జనవరి 09,(ప్రజా కలం)





గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం మండలం పడమటి తాండ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మాజీ సర్పంచ్ సభావత్ అనితా రవి నాయక్,లింగ్యా నాయక్ తో కలిసి ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేసిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్బంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో కొన్ని సంవత్సరాలు గిరిజన సోదరులు తాండలను గ్రామ పంచాయతీలుగా చెయ్యలని చేసిన పోరాటాన్ని దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ గారు రాగానే తాండలను గ్రామ పంచాయతీలుగా చేసి వారి పాలన వారే నిర్వహించుకునేటట్లు చేసిన ఘనత కేసీఆర్ గారిదేనని అన్నారు. అందులో భాగంగానే నాగరం గ్రామ పంచాయతీలో ఉన్న పడమటి తాండను గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా గ్రామపంచాయతీకి కేటాయించిన నిధులతో తాండ రూపురేఖలు మారి పోయాయని,గత ప్రభుత్వంలోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిచాయని. ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఏ ఒక్క గ్రామ పంచాయతీకి ఇవ్వలేకపోయిందని అన్నారు. తప్పనిసరి లోకల్ ఎలక్షన్స్ చెయ్యాల్సి వచ్చిన పరిస్తితి ఏర్పడిందని. కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం లేనందున ఓటర్లను ప్రసన్నం చేసుకునే ఉద్దేశంతో మళ్ళీ రైతుబందు (రైతుబరోసా) ఇస్తామని మాయ-మాటలు చెప్తున్నారు. ఒకవేళ ఇచ్చిన ఎలక్షన్ కోసం ఒక్కసారే ఇస్తారని అన్నారు. సంపూర్ణ రుణమాఫీ చెయ్యనేలేదు,రెండు సార్లు రైతుబందు ఎగ్గొట్టారు. 15 వేలు ఇస్తామన్న రైతుబరోసా 12 వేలకు కుదించారని అని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎం చేశారో చెప్పలేక చెప్పడానికి ఏమి చెయ్యలేదని వారి లోపాలను కప్పిపుచ్చుకునేందుకే గతప్రభుత్వం ఎం చేసిందని ఎదురు దాడి చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్తున్నారని అన్నారు. గతంలో మీ మాయమాటలని నమ్మిన ప్రజలు ఇప్పుడు నమ్మేపరిస్థితిలో లేరని మీకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, BRS పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు,గ్రామ ప్రజలు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్



### - చల్లంపల్లి మాజీ సర్పంచ్ నరేందర్

కడ్తాల్, జనవరి 09, (ప్రజా కలం)

నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వెళు న్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టివిక్రమార్క కి పార్లమెంట్ సభ్యులు మల్లు రవి కి కడ్తాల్ మండల కేంద్రంలో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్ చల్లంపల్లి మాజీ,సర్పంచ్ నరేందర్ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి వినతి పత్రం అందజేయడం జరిగింది గ్రామం చలంపల్లీ కడ్తాల్ మండల్ రంగారెడ్డి జిల్లా గ్రామ శివారులో ఉన్న 165 సర్వే నెంబర్ ముందు అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారి హయాంలో ఇచ్చినటువంటి భూమిని రైతుల యొక్క అనుమతి లేకుండా గత ప్రభుత్వం టిఆర్ఎస్ సహకారంతో బద్దం జంగారెడ్డి గ్రామం కందుకూరు రంగారెడ్డి జిల్లా నివాసి అయిన అతను రాజకీయ ఆర్థిక ప్రహద్బలం తో అక్రమ దారిలో శ్రీ మాక్స్ మైన్స్ మైనింగ్ పేరుతో 106 ఎకరాలు ప్రభుత్వ భూమిని అని తప్పుడు పత్రాలతో లీజు తెచ్చుకోవడం జరిగింది. రైతుల యొక్క వ్యతిరేకత వల్ల రెవెన్యూ డిపార్ట్మెంట్ జాయింట్ సర్వే 2021 సంవత్సరంలో చేయడం జరిగింది. అందులో రైతులు ఉన్నారని తేల్చడం జరిగింది ఈ 106 ఎకరాల్లో 23 ఎకరాల నాట్ సరెండర్ ల్యాండ్ అని ఆర్డిఓ కలెక్టర్ గారికి రిపోర్ట్ చేయడం జరిగింది కానీ మాక్స్ మైనింగ్ వారు రాజకీయ ఆర్థిక పలుకుబడితో రిపోర్టును కలెక్టర్ ఆఫీస్ నందు హెూల్డ్ చేశారు. కావున మా యందు దయ ఉ ంచి అక్రమ యోజన రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని మా యొక్క విన్నపం ఈ యొక్క లెటర్ ను బట్టి విక్రమార్క అయినటువంటి డిప్యూటీ సీఎం గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో చల్లంపల్లి గ్రామవాసులు మాలే రమేష్ గౌడ్ నాయిని మల్లేష్ రాయకండి సుధాకర్ పవన్ కుమార్ మధుగారి కృష్ణయ్య మల్లేపల్లి మహేష్ పాల్గొన్నారు.

# త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు

- గత బి ఆర్ ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగింది
- పెన్షన్లు మంజూరు అయ్యేలా చూడాలని కిచ్చెన్నకు వినతి
- మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జనవరి 09, (ప్రజా కలం)



మామిడిపల్లి ప్రజలతో కేఎల్ఆర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుకుంటూ వస్తున్నామని మాజీఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ మామిడిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కెఎల్ఆర్ ను కలిసి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు.

ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చుతూనే త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుబంధు, పెన్షన్లు ఇస్తామన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్స్, అన్ని బకాయిల చెల్లింపులు చేసేలా ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క చర్యలు చేపడుతున్నారని అన్నారు. అనారోగ్యంతో ఉన్న మహిళను వెంటనే ఆస్పత్రిలో చేర్చి బాగోగులు చూడాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీ బాగు చేయాలని మామిడిపల్లి నాయకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన కేఎల్ఆర్ అధికారులతో మాట్లాడి సమస్యలు లేని నియోజకవర్గంగా మహేశ్వరాన్ని తీర్చిదిద్దాలని కోరారు.

## నార్సింగ్ పి హెచ్ ఎస్ లో వినతి పత్రం అందజేసిన

# నార్సింగ్ ఆశ వర్కర్స్ సిఐటియు



రాజేంద్రనగర్, జనవరి 09, (ప్రజా కలం)

9 న నార్సింగ్ పి హెచ్ ఎస్ లో ఆశ వర్కర్స్ సమస్యల పైన వినతి పత్రం సిఐటియు ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. 10 న నాడు ఎమ్మెల్యే ఇల్లు, ఎమ్మెల్యే క్యాంపస్ దగ్గర ధర్నా సందర్భంగా గండిపేట్ మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పైన అనేక ధర్నాలు కమిషనర్ల ఆఫీసర్ల ముందు ధర్నాలు ధర్నాలు బస్సు యాత్రలు ఎన్ని జరిపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం వస్తలేదు కాబట్టి రేపు ఎమ్మెల్యే ఇండ్లు మరి క్యాంపస్ దగ్గర ఆశ వర్కర్ల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతాం కనీస వేతనం 18000 ఫిక్స్ వేతనం ఇవ్వాలని ఆశలను పర్మినెంట్ చేయాలని పిఎఫ్ ఎస్ఐ సౌకర్యాలు ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని అనేక సమస్యల మీద రేపు ఎమ్మెల్యే క్యాంపస్ ఎదుట ధర్నా ఉంటుంది కాబట్టి పెద్ద ఎత్తున ఆశలు కదిలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్ ఎస్ ఆశ వర్కర్ల అందరు పాల్గొనడం జరిగింది.

## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో

# పత్రికలది కీలకపాత్ర

### ప్రజా కలం పత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించిన మహేశ్వరం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య



ప్రజా కలం పత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించిన కర్రోళ్ల చంద్రయ్య

మహేశ్వరం, జనవరి 09, (ప్రజా కలం)

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పత్రికలది కీలకపాత్ర అని మహేశ్వరం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య అన్నారు. ప్రజా కలం 2025 నూతన క్యాలెండర్ ను మహేశ్వరం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రయ్య ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పత్రికలు ఎప్పటికప్పుడు కీలక పాత్ర పోషిస్తున్నాయని అందులో భాగంగా ప్రజా కలం పత్రిక కూడా ప్రజా సమస్యల పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కరిస్తూ ప్రజా సమస్యల ప్రభుత్వానికి తెలియజేస్తూ వారధిగా పరిచేయాల్సిన అవసరం ఉందని చంద్రయ్య అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ఎలాంటి పరిస్థితుల్లోనైనా పత్రికలు ధైర్యంగా పనిచేస్తూ ప్రజల నాయకుల ఆదరణ పొందుతూ పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తూ అందరికీ మంచి జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ప్రజా కలం రిపోర్టర్ తడక నర్సింహా, అక్షర విజేత రిపోర్టర్ చంద్రశేఖర్ , విశ్వాంబర రిపోర్టర్ నాగేష్, బిగ్ టీవీ రిపోర్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.



## చైనా మాంజా విక్రయిస్తే
# చట్టరీత్యా చర్యలు తప్పవు
### - ఎస్సై బొజ్జ మహేష్

ఎల్లారెడ్డి జనవరి 09 ప్రజా కలం ప్రతినిధి : రానున్న సంక్రాంతి పండుగ దృష్ట్యా పతంగుల విక్రయదారులు నిషేధిత చైనా మాంసం విక్రయిస్తే చట్టరీ కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బొజ్జ మహేష్ హెచ్చరించారు. మేరకు ఆయన గురువారం పట్టణంలోని పతంగుల విక్రయ కేంద్రాలను సందర్శించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చైనా మాంజా పతంగులకు వాడి పడేయడం వలన ప్రజలకు, జంతువులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉ ంటుందన్నారు. రాబోయే సంక్రాంతి సందర్భంగా చిన్నపిల్లలు, పెద్దలు సరదా కొరకు ఎగరవేసే పతంగులకు నైలాన్, సింథటిక్ తో తయారు చేసిన చైనా మంజా వాడకూడదన్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగాల పైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ, ఎవరైనా దానిని నిలువ ఉంచిన, తయారుచేసిన, అమ్మిన, అమ్మడానికి ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా చైనా మంజా నిలువ చేసిన, అమ్మిన, వాడిన డయల్ 100 కి గాని పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం...
### - పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు...

ఎల్లారెడ్డి జనవరి 09 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. మండలంలోని సాతెల్లి, మత్తమాల, మల్కాపూర్, అల్మాజిపూర్, రుద్రారం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కో ఆర్డినేషన్



కమిటీ సభ్యులు గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. జనవరి 26 నుండి అర్హులైన లబ్ధిదారులకు రైతు భరోసా, రైతు కూలీలకు ఇచ్చే 12వేల రూపాయలు, భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేలు, నూతన తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తారని వారు తెలిపారు. అదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు వెంకట్రామిరెడ్డి, కృష్ణా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఉష గౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ బొండ్ల సాయిలు, సొసైటీ వైస్ చైర్మన్ పద్మా రావ్, రుద్రారం మాజీ సర్పంచ్ సత్తయ్య, అల్మాజి పూర్ మాజీ సర్పంచ్ మాధవి దత్తు, సాతెల్లి మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, మల్లయ్య పల్లి మాజీ సర్పంచ్ ఎల్లయ్య, సాతెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, రుద్రారం గ్రామ అధ్యక్షుడు రుక్మ రెడ్డి, అల్మాజిపూర్ గ్రామ అధ్యక్షుడు హన్మంతు, మల్కాపూర్ గ్రామ అధ్యక్షుడు కటికెల శ్రీను, మత్తమాల గ్రామ అధ్యక్షుడు సాల్మన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## ఘనంగా ఫాతిమా షేఖ్ జయంతి వేడుకలు...

ఎల్లారెడ్డి జనవరి 09 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం భారత దేశ తొలి ముస్లిం ఉ పాధ్యాయురాలు ఫాతిమా షేఖ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫత్ ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫాతిమా షేఖ్ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ సి బాలరాజ్, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, మాంజూర్ ఖాన్, ఖాజా,నాగరాజు, దత్తాత్రేయ, నవీన్ కుమార్, శివ ప్రసాద్, ఫర్హానా , రిజ్వన, శ్రీదేవి, అనురాధ, జ్యోతి, నాగరాజు, సంతోష్, బాలమణి, సయ్యద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



### నాలాల పక్కన ఉన్న నిర్మాలను వెంబడి తొలగించాలని
# అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు చేపట్టాలి
### శంషాబాద్ చారి నగర్ లో దర్మజి గుంట గొల్లకుంట ను సందర్శించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్

శంషాబాద్, జనవరి 09, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలో చారి నగర్ లో దర్మజి గుంట గొల్లకుంట ను సందర్శించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్, నాలాల పక్కన ఉన్న నిర్మాలను వెంబడి తొలగించాలని అధికారులకు సూచించారు.

ధర్మోజికుంట గొల్ల కుంటలో ఉన్న భూమి విస్తరణను తగ్గించి భూకబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆ భూమిలో ఉన్న అక్రమ నాళాలు అక్రమ గోడలు అక్రమ భవనాలు వెంబడే తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.

రాజేంద్రనగర్ గాని శంషాబాద్ గాని ఇలాంటి నాలాలపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోని వదలమని అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్య తీసుకొని సస్పెండ్ వేటు పడుతుందని అన్నారు కనుక నాళాలపై వ్యక్తిగల్ బఫర్ లో ఉన్న భూములను ఉన్న నిర్మాణాలని వెంబడే తొలగిస్తామని హెచ్చరించారు.అధికారులను నిర్లక్ష్యం ఉంటే వారిని కట్టిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేసామని అన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో కాషాయం జెండా ఎగిరే వరకు నిద్రపోను
## కొల్చారం మండలం
## బిజెపి నూతన అధ్యక్షులు పంతులు హరీష్

మెదక్ జనవరి 09(ప్రజాకలం ప్రతినిధి)

మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో కొల్చారం మండలం బిజెపి అధ్యక్షునిగా చిన్న ఘనాపూర్ గ్రామానికి చెందిన పంతులు హరీష్ గురువారం ఎన్నికయ్యారు. ఇప్పటివరకు పాతూరి దయాకర్ గౌడ్ అధ్యక్షులుగా గత ఆరు సంవత్సరాలుగా కొనసాగారు. ఇటీవల జరిగిన అభిప్రాయ సేకరణలో 95%.. పంతులు హరీష్ వైపు మొగ్గ చూపడంతో హరీష్ ను ఎన్నుకున్నారు. హరీష్ సరస్వతీ శిశు మందిర్ నుంచి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ అఖిల భారత విద్యార్థి పరిషత్ భారతీయ జనతా పార్టీ యువత విభాగం మండల అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉంది. అందర్నీ కలుపుకుపోయే స్వభావం, యువతను ఆకర్షించే విధంగా అతని మాట తీరు అన్ని అతని వైపే ముగ్గు చూపడంతో పార్టీ సీనియర్ నాయకులు సైతం హరీష్ కు మండల బాధ్యతలను అప్పజెప్పాలని సూచించడంతో కొల్చారం మండల పార్టీ అధ్యక్షులుగా హరీష్ దక్కింది.

ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షులకు, పార్టీ పెద్దలకు కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరికి అందుబాటులో ఉండి




పార్టీ ఎదుగుదలకు పని చేస్తానని, స్థానిక సంస్థ ఎన్నికల్లో కొల్చారం గడ్డపై కాషాయం జెండా ఎగిరే వరకు నిద్రపోను అని ధీమా వ్యక్తం చేశారు. నాపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి ఇచ్చిన పార్టీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అలాగే బిజెపి కార్యకర్తలు ఏ లోటు వచ్చిన తక్షణమే స్పందించి పార్టీ పెద్దలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే దిశగా పార్టీకోసం పనిచేస్తానని హరీష్ తెలిపారు.

# కాంగ్రెస్ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండెమోని జయమ్మ

ఇబ్రహీంపట్నం, జనవరి 9, (ప్రజా కలం ):



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధానకార్యదర్శిగా గుండెమోని జయమ్మను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తన చేతుల మీదుగా గాంధీ భవన్‌లో నియామక పత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. గుండెమోని జయమ్మ రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పనిచేసింది. జయమ్మ రంగారెడ్డి జిల్లాలోని మంచాల మండలం ఎల్లమ్మతండా గ్రామానికి చెందినా మహిళా. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనపై నమ్మకంతో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీలో చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్ అధిష్టానానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. ఘన పదవికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.

# నిజామాబాద్ జిల్లా మాష్టి మాస్టిన్ సభ్యుల పదవి ఎన్నిక

ఆర్మూర్, (ప్రజా కలం ప్రతినిధి) జనవరి 09:

ఆర్మూర్ డివిజన్ లో,జిఎన్ఆర్ గార్డెన్ లో రాష్ట్ర అధ్యక్షులు బుద్దుల గంగ



నర్సయ్య ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మాష్టి మస్టిన్ నూతన అధ్యక్షులుగా రెండవ సారి బుద్దుల రాజన్నను ఉపాధ్యక్షులు ఇటుకల నల్లన్న జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిలుముల నర్సయ్య క్యాషర్ గా బుద్దుల నరేష్ కోశాధికారి చిలుముల శ్రీకాంత్ ను అందరి సమీక్షములో ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్దుల నల్లన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దర్శనం శంకర్ బుద్దుల హరీష్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు దర్శనం ముతెన్న నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాదారులు తప్పక హెల్మేట్ ధరించాలి..

నిజామాబాద్,( ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:

జాతీయ రోడ్డు భద్రతా మాహొత్సవాలు- 2025 అవగాహన కార్యక్రమంలో వక్తల పిలుపు చైనా మాంజా వాడకం నిషేదం ద్విచక్ర వాహనాదారులు తప్పక హెల్మెట్ ధరించాలి. అని జాతీయ రోడ్డు భద్రత మహొత్సవాల అవగాహన కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ ఇంచార్జీపోలీస్ కమీషనర్ సి.హెచ్. సింధూశర్మ, ఐ.పి.యస్. ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా మాహొత్సవాలు-2025 అవగాహన కార్యక్రమములో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిదులుగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఐ.ఎ.ఎస్, జిల్లా జడ్జి సునితా కుంచాల, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) జి.బస్వారెడ్డి, జిల్లా ట్రాన్స్పోర్టు కమీషనర్ దుర్గా ప్రమీల, ఆర్.టి.ఓ జె. ఉమామహేశ్వరరావు హాజరై జండా ఊపి ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లా డుతూ.. నిజామాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని ద్విచక్ర వాహనాదారులు తమ వ్యక్తిగత రక్షణ నిమిత్తం తప్పక హెల్మెట్ ధరించాలని, అదేవిధంగా హెల్మేట్ ధరించకుండా వాహనాలు నడిపిన ట్రిబల్ రైడింగ్ చేసిన వాహనాదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించకపోయిన వారి పై మోటారు వెహికిల్ చట్టం క్రింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని



తెలియజేశారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరిండం వలన తమప్రాణాలను కాపాడుకున్నవారు అవుతారని, దాని వలన తమ కుటుంబ సభ్యులు కూడా ఎంతో సంతోషంగా ఉంటారని, హెల్మెటు ధరించలేని సమయంలో ప్రమాద వశత్తుగా ఏదైనా ప్రమాదానికి గురి అయి అట్టి ప్రమాదంలో గాయాల పాలు కావచ్చు. లేదా ప్రమాదంలో మృతి చెందితే అట్టి కుటుంబాన్ని కన్నీటి పాలు చేసే పరిస్థితి వస్తుందని, కావున ప్రతిఒక్కరు హెల్మెటు ధరించి తమ ప్రాణాలను కాపాడుకొవడమే కాకుండా తన కుటుంబాన్ని సురక్షితంగా కాపాడుకున్నవారు అవుతారని తెలిపారు. ప్రజలరక్షణకోసం అన్నిచర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు వాహనాదారులు తప్పక వాహనానికి సంబంధించిన కాగితాలు తమవద్ద ఉంచుకోవాలని, ట్రాఫిక్ రుల్స్ తప్పక పాటించాలని అన్నారు.ప్రతి ఒక్కరు హెల్మెట్ దరించాలని, వాహనాలను అతి వేగంగా నడవపద్దని, త్రిబల్ రైడింగ్ చేయరాదని తెలియజేశారు. చైనా మాంజా ఎవ్వరయిన నిలువ ఉంచిన, ఎవ్వరయిన తయారుచేసిన. ఎవ్వరయిన అమ్మిన, అమ్మడానికి ఎవ్వరయిన ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడును. ఎవ్వరయిన బయట పడేసినట్లయితే ప్రజలకు మరియు జంతువులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. విక్రయించిన మాంజా తో ఎద్దైనా ప్రమాదం జరిగినట్లయితే విక్రయ దారులు కూడా అట్టి కేసుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎవ్వరయిన సూచనలకు విరుద్ధంగా ఎవ్వరయిన చైనా మంజా నిలువచేసిన, అమ్మిన వారిపై చట్ట ప్రకారం చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు తప్పకుండా హెల్మేటు ధరించాలని, ప్రజలందరూ తప్ప కుండా ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని, ఈ నెల రోజులలో ఈ మాహొసోత్సవాలను అందరము విజయవంతం చేయాలని, ప్రజల ప్రాణాలను కాపాడటానికి అందరము ట్రాఫిక్ రూల్స్ పాటించే విధంగాకృషి చేయాలని అన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా చైనా మాంజా వాడకూడదూ అని ఎవ్వరైనా చైనా మాంజా వాడినట్లయితే వారికి 5 సంవత్సరాల జైలు శిక్ష లేదా 1 లక్ష రూపాయల వరకు జరిమాన గలదు అన్నారు. ఈ సందర్భంగా ప్ల కార్డుల ద్వారా ప్రదర్శించి, తదువరి హెల్మేట్లు ధరించిన వారికి గులాబి పువ్వులు ఇచ్చి అభినందించారు. హెల్మెటు ధరించని వారికి కొత్త హెల్మెట్లు ఇచ్చి హెల్మేటు తప్పకుండా ధరించాలని సూచనలు ఇచ్చారు. అనంతరం ద్విచక్ర వాహనాల ర్యాలీ ఎన్.టి.ఆర్ చౌరస్తా నుండి ప్రారంభం అయి కోర్టు చౌరస్తా ,గ్లామర్ హొటల్, తిలక్ గార్డెన్, ప్రభుత్వ హాస్పటల్, దేవి రోడ్డు, నెహ్రూ పార్కు, ఆర్.టి.సి బస్టాండ్, రైల్వే స్టేషన్, పోలీస్ హెడ్ క్వార్టర్కు చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఖుష్బు ఉపాద్యాయా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గోపిక్రిష్ణ ,ఆర్మూర్, బోధన్ ఎమ్.వి.ఐలు జి. వివేకనంద రెడ్డి కె. అజయ్ కుమార్ నిజామాబాద్ ఎ.సి.పి రాజా వెంకట రెడ్డి. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, నిజామాబాద్ డివిజన్ సి.ఐ లు, ఎస్.ఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్స్ సతీష్ కుమార్, శ్రీనివాస్, తిరుపతి, ట్రాఫిక్ ఎస్.ఐలు చంద్రమోహన్ రహమత్ ఉల్లా, ఆర్.ఎస్.ఐలు బి.సుమన్, దాదాపు 300 ద్విచక్ర వాహనాదారులు (ట్రాఫిక్ సిబ్బంది, ఎ.ఆర్ సిబ్బంది, సివిల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, మహిళా సిబ్బంది, హొమ్ గార్డ్స్ సిబ్బంది ) పాల్గొన్నారు.

# సాగు చేసే రైతులకే భరోసా



నిజామాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద ప్రతి ఎకరానికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేస్తామని వెల్లడించింది. రైతు భరోసా ఇన్ని ఎకరాలకు మాత్రమే అనే పరిమితి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. రైతులు, రైతు సంఘాలతో సమావేశాలు నిర్వహించి...వారి అభిప్రాయాలు సేకరించారు. చివరకు ఎలాంటి పరిమితి లేకుండా సాగు చేస్తు?న్న ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించింది.వ్యవసాయం చేస్తున్న, సాగు చేసేందుకు అనుకూలంగా ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాళ్లు, గుట్టలు, పరిశ్రమలకు ఇచ్చిన భూములు, రోడ్లు, వెంచర్ల వేసిన భూములకు రైతు భరోసా ఇవ్వమని స్పష్టం చేసింది. ఇలాంటి భూములున్న వారికి రైతు భరోసా దక్కదు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారికి పొలాలు ఉంటే వారికి కూడా రైతు భరోసా వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ పథకంపై పూర్తి విధి విధానాలు విడుదలైతే గానీ మరిన్ని విషయాలపై స్పష్టత రాదు.కేంద్ర ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్ కింద ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద ఏటా రూ.10 వేలు జమ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను రూ.15 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పెట్టుబడి సాయంగా రూ.12 వేలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు భరోసా నిధులను రెండు విడతలుగా జమ చేయనుంది. మొదటి విడతను 2025 జనవరి 26న గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అంటే తొలి విడతలో ఎకరానికి రూ.6,000 చొప్పున జమచేస్తారు. నిధులు విడుదలైన నాటి నుంచి పదిరోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది."రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతులకు ఎకరానికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. కేసీఆర్ 200 ఎకరాలు సాగు చేస్తే 200 ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తాం" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి వ్యాఖ్యల నేపథ్యంలో రైతు భరోసా ఇన్ని ఎకరాలకు పరిమితి లేదని స్పష్టం అవుతుంది. రైతు భరోసా పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.7,800 కోట్ల దాకా కేటాయించాల్సి ఉంటుంది. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు అందించనున్నారు. ఈ పథకానికి రూ.12,000 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఈ రెండు పథకాలకు దాదాపు రూ.20 వేల కోట్లు జనవరి 25 లోపు ప్రభుత్వం సమకూర్చుకోవాల్సి ఉంటుంది.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1.53 కోటి ఎకరాలకు రైతు బంధు కింద నగదు జమ చేసేది. రైతు బంధు స్కీమ్ లో 69 లక్షల మంది సాయం పొందారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం చేయాలని అంచనా వేయగా...దాదాపు 1 కోటి 30 లక్షల ఎకరాలకు లెక్కతేలిందని అంచనా. దీంతో మొత్తం 62 లక్షల మంది రైతులకు జనవరి 26 నుంచి ఖాతాల్లో నగదు జమ కానుంది.

# ఉందిగా జాగా..వేసేయ్ పాగా..

ఖమ్మం : భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ గాడి తప్పింది. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు, చెరువులు, నాలాలు, శిఖం భూముల ఆక్రమించుకుని విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడట్లేదు. జిల్లా కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వచ్చి పోతున్నారంటే ఇక మారుమూల మండలాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు.దీంతో ప్రతి ప్రభుత్వ శాఖలోనూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. ఖాళీ జాగా కన్పిస్తే పాగా వేసేయ్ అన్నట్లు ఉంది జిల్లాలో పరిస్థితి. ప్రభుత్వ భూముల్లో ఆక్రమ వెంచర్లు, తప్పుడు సర్వే నంబర్లతో సీలింగ్ భూముల ఆక్రమణలు, చెరువులు నాలాలు, శిఖం భూముల పరిస్థితి దారుణంగా తయారైంది.జిల్లాలో పగలురాత్రీ తేడాలేకుండా వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయన్న విమర్శలు విన్పిస్తున్నాయి. వెంగళరావు కాలనీ సమీపంలో వందల ఎకరాల ఫారెస్టు భూమిని కేటీపీఎస్ ఉద్యోగులకు అక్రమ మార్గంలో పట్టాలు చేశారని సమాచారం.రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం పాల్వంచ పట్టణంలోని సర్వే నంబర్ 444లో మొత్తం విస్తీర్ణం 853.39 ఎకరాలుంటే, అందులో 387 .25 ఎకరాలు నిరుపేదలకు అసైన్ చేశారు. 16 ఎకరాలు ఆక్రమార్కుల చేతిలో ఉంది. సర్వేనం 817లో 2,361.37 ఎకరాల్లో 128 .07 ఎకరాలను నిరుపేదలకు పంపిణీచేశారు. 1,790 ఎకరాలు ఫారెస్టు భూమి, 85.14 ఎకరాలు ఆక్రమణలో ఉంది.సర్వే నం 999లోనూ 4,169.29 ఎకరాలకు 863.23 ఎకరాలను అసైన్ చేశారు. 1,153 ఎకరాలు ఫారెస్టు భూమి కాగా 327.38 ఎకరాలు ఆక్రణకు గురైనట్టు రెవెన్యూ అధికారులే నివేదిక ఇవ్వడం గమనార్హం. తాజాగా 444 సర్వే నంబర్ భూమిలో ఎక్కడో శేఖరంబంజర్ వద్ద ఉన్న 431 సర్వే నంబర్ డాక్యుమెంట్స్ చూపి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ సుమారు పదెకరాల ప్రభుత్వ భూమిలో ఓ భూబకాసురుడు ఏకంగా వెంచర్ వేస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. హెచ్‌పీ గ్యాస్ గోదాం, ఆఫీస్‌కు భూమి అవసరం ఉందని గత నాలుగేళ్లుగా అర్జీలు పెడుతున్నా.. వారికి రెవెన్యూ అధికారులు భూమి చూపలేక పోతున్నారు. లొంగిపోయిన భూమి ఇవ్వాలన్నా, నిరుపేదలకు ఇంటిస్థలం కావాలన్నా, ప్రభుత్వ అవసరాలకు భూమి అవసరం ఉన్నా పాల్వంచ పట్టణంలో సెంటు భూమి లేదని అధికారులు చెప్తున్నారు. రియల్ ఎస్టేట్ కు, ఆక్రమ కట్టడాలకు మాత్రం భూమి ఎక్కడి నుంచి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ అధికారుల తీరుపై పలుమార్లు హెచ్చరికలు జారీచేసినా వారిలో ఎలాంటి మార్పు రాకపోవడం దారుణం. ఇకనైనా మంత్రి కల్పించుకొని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ ఉక్కుపాదం మోపారు. స్థానిక కేఎస్ఎం పెట్రోల్ బంకు నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న భూమి సర్వే నం 444/1 గా గుర్తించి ఎలాంటి నిర్మాణాలు చేయరాదని ఆదేశాలు జారీచేశారు. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో నిర్మాణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు.మరోవైపు నవభారత్ 444 సర్వే నంబర్‌లో సీలింగ్ భూముల్లో తప్పుడు సర్వే నంబర్లతో దొడ్డిదారిన వెంచర్ల వేసి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడు. ఇవి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జరుగుతున్న అక్రమాలు.ఇక పాల్వంచ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో పాల్వంచ మున్సిపాల్టీ నంబర్ చూపి తప్పుడు డాక్యుమెంట్స్‌తో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా హెచ్ కన్వెన్షన్ నిర్మిచడమే కాకుండా ప్రభుత్వ భూమని ఆక్రమించి దర్జాగా మెటల్ రోడ్డు నిర్మించినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు మోక్షవెంకటేశ్వరస్వామి భూములు ఆక్రమణకు గురైనట్టు అనుమానించి సర్వే చేయాలని ఎండోమెంట్ అధికారులు రెవెన్యూ శాఖను కోరి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు

# ఆటల్లో గెలుపు ఓటములు సహజం

## ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి - ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల : జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రుద్రంగి మండలం మనాల గ్రామంలో వాలిబాల్ టోర్నమెంట్.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలంగాణ రాష్ట్ర హకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలసి ప్రారంభించిన విప్.పోలీస్ శాఖకు యువతకు సత్సంబంధాలు మెరుగుపర్చలనే ఉద్దేశ్యంతో రుద్రంగి మండలం మానాల గ్రామంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలిబాల్ పోటీలలో క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరుస్తూ జిల్లా,జాతీయ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ. పోలీస్ శాఖ అనగానే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే తప్ప ఇతరత్రా సమస్యలు దూరంగా ఉంటుందనే అనే ముద్ర నుండి సామాజిక రుగ్మతలు రూపుమముతూ ఏదైనా సమస్యలు తలెత్తుతే మేము ఉన్నాం అంటూ శాంతి భద్రతలను సమర్థవంతగా నిర్వహిస్తూనే ప్రజలకు, యువతకు పోలీస్ సేవలు మెరుగు పరచాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో విన్నూత కార్యక్రమాలు చేపడుతూ జిల్లా ప్రజలకు భరోసా కల్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలోని జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో డ్రైవింగ్ వచ్చి డ్రైవింగ్ లైసెన్స్ లేని లైసెన్స్ లు అందజేయలనే ఉద్దేశ్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మేళా నిర్వహించి గతంలో 100 మంది యువతి యువకులకు లైసెన్స్ అందజేయడం జరిగిందని రెండవ దశలో సుమారు 700 వరకు లైసెన్స్ లు అందిచేలా ప్రణాళిక రూపొందించడం అభినందనియమన్నారు. యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చెస్తూ, జిల్లాలో పోలీస్ శాఖ గంజాయిపై ఉక్కుపాదం మోపుతు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తులను సన్మార్గంలో నడిపించడానికి జిల్లా కేంద్రంలో డి ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతా యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని, ఏఆటలోనైనా గెలుపు, ఓటమి అనేది సహజం కాని చివరి వరకు పోరాడాలి అన్నారు. ప్రతి ఒక్కరిలో టీమ్ స్పిరిట్ ఉండలని అప్పుడే విజయం మన చెంతకి చేరితుందని అని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా నైపున్యాభివృద్ధి చేసుకొని చదువు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న మానాల గ్రామాన్ని తరచు సందర్శించడం జరుగుతుందని, ఇటీవల కాలంలో మానాల చుట్టూ ప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, అంతే కాక యువతకు పోలీస్ సేవలు చేరువ చేయాలని, యువత చెడు వ్యాసనాల వైపు దారి మల్లకుండా యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ, స్పోర్ట్స్ మీట్ వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. యువత గంజాయి వంటి మాధకద్రవ్యాల దూరంగా ఉండాలన్నారు. మానాల గ్రామంలో ఏర్పటు చేసిన మండల స్థాయి వాలిబాల్ పోటీలలో 13 జట్లు పాల్గొననున్నాయి అని వీరికి పోటీల అనంతరం గెలుపొందిన జట్లకు బహమతులు అందజేయాడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లు అశోక్, అంజయ్య, క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శిశు సంరక్షణసంస్థల్లోని పిల్లలకు ధృవీకరణ పత్రాల పంపిణీ

హైదరాబాద్ : శిశు సంరక్షణ సంస్థలలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధ్రువీకరణ (సర్టిఫికెట్లను) పత్రాలను రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పంపిణీ చేసారు. 50 శిశు సంరక్షణ కేంద్రాల్లో 2300 మందికి పైగా పిల్లలు ఉన్నారు. ఈరోజు 1330 మందికి వివిధ రకాల సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ విజయారెడ్డి , యూనిసెఫ్ ప్రతినిదులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ హైదరాబాద్ శిశుకేంద్రాల్లో సంరక్షణ పొందుతున్న 1330 మందికి పైగా వివిధ రకాల గుర్తింపు , విద్యాపరమైన ,వారి కుల ,నివాస , ఆధార్ తదితర సర్టిఫికెట్ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం జరిగింది. జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులకు అభినందనలు. సర్టిఫికెట్ పొందుతున్న వారికి భవిష్యత్ లో అంతా మంచే జరగాలని జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్న మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. భవిష్యత్ కార్యక్రమాల్లో కూడా ఉపాధి ఇతర రంగాల్లో కూడా ప్రభుత్వ సహకారం ఉంటుంది. ఇప్పుడున్న 50 శిశు విహార్ కేంద్రాల్లో 6 ప్రభుత్వం నడుపుతుంది. మిగతావాటికి కూడా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది. ఇలాంటి ప్రక్రియ దేశంలో ఎక్కడ జరగడం లేదు. హైదరాబాద్ రాష్ట్ర రాజధాని కాకుండా కాస్మోపాలిటన్ సిటీ అన్ని రకాల ప్రాంత ప్రజలు ఇక్కడ ఉంటారు. ఇటువంటి వ్యవస్థ లో ఉన్న వారికి ఆధారాలు ఉండలని జిల్లా యంత్రాంగం ప్రతిష్టగా తీసుకుందని అన్నారు. గుర్తింపు మనిషి ఐడెంటిటీ మనం భవిష్యత్ లో బయటకు వెళ్ళినప్పుడు ఇది చాలా అవసరం. ఆ సర్టిఫికెట్ ద్వారా మీకు వచ్చే కోటాలో అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నా. మీరు మంచిగా చదువుకొని కాంపిటేటివ్ స్పిరిట్ లో ముందుకు పోవాలి. ప్రభుత్వం అండగా ఉంటుంది. సమాజంలో నాకెందుకు అనుకోకూడదు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయి.. రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తున్నాయి. అర్ఫాన్స్ విషయంలో ప్రజా పాలన ప్రభుత్వం మంత్రులు అధికారులు సానుకూలంగా ఉందని అన్నారు.

# ప్రమాదం అంచున పక్షుల ప్రపంచం

**డాక్టర్ భారత రవీందర్ గెజిటెడ్ హెడ్మాస్టర్, పర్యావరణ నిపుణుడు**

హైదరాబాద్ : ప్రకృతి యొక్క అత్యంత అందమైన ఆకర్షణీయమైన జీవులలో పక్షులు ఒకటి . ఇవి రెండు కాళ్ళు రెండురెక్కలు కలిగి ఉండి శరీరమంతా ఈకలతో నిండి ఉన్న అండోత్పాదక మరియు ఉష్ణ రక్త విహంగ జీవులు. పూర్వ కాలంనాటి పురాణాలు కావ్యాలు, జానపదకథలలో పక్షులు ప్రధాన పాత్ర పోషించినట్లు మన హిందూపురాణ గాధలు చెబుతున్నాయి. విష్ణువుకు గరుడపక్షి సరస్వతికి హంస కార్తికేయునికి నెమలి (ప్రస్తుతం జాతీయ పక్షి) వాహనాలుగా ఉన్నాయి. మహాభారత యుద్ధంలో గరుడపక్షి అర్జునుడి విజయానికి తోడ్పడింది. క్రౌంచపక్షి దంపతుల వియోగం శ్రీమద్రామాయణం అవతరణకు కారణమైంది. జటాయువు పక్షి రామునికి సాయం చేసినట్లు రామాయణం చెబుతోంది. పూర్వం రాజులకాలంలో పావురాలు వార్తాహారులుగా ఉపయోగపడేవి. నాటి నుండి కూడా మానవ కర్మకాండల విశ్వాసాలలో కాకుల పాత్ర గణనీయమైంది. ప్రస్తుతం పక్షులు జీవశాస్త్రం మరియు మానసిక శాస్త్ర ప్రయోగాలలో ఉపయోగపడుతున్నాయి. నేటి ఆధునిక జంతు శిలాజ శాస్త్ర నిదర్శనాల ప్రకారం పక్షులు సుమారు 15 కోట్ల సంవత్సరాల పూర్వం జురాసిక్ యుగం లో థీరోపోడ్ లు అనే డైనోసార్ల నుండి పరిణామం చెందినాయని జీవశాస్త్ర చరిత్ర చెబుతోంది . భూమిపై మానవ మనుగడకు అత్యంత అవసరమైన పక్షులు వేగంగా అంతరించిపోతున్న కారణంగా వాటి ఉనికిని తిరిగి నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో అమెరికాలోని ఏవియన్ వెల్ఫేర్ కోహిలిషన్ సంస్థ అధ్వర్యంలో 2002 లో మొట్టమొదట జాతీయ పక్షి దినోత్సవం నిర్వహించబడిం. మన దేశంలో ప్రతి ఏట ప్రపంచ ప్రఖ్యాత భారతీయ పక్షి ప్రేమికుడు, బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ సలీం అలీ జన్మదినమైన జనవరి 5 న జాతీయ పక్షుల దినోత్సవం ( నేషనల్ బర్డ్ డే ) జరుపుకుంటున్నాము. గత సంవత్సరం ఫైట్ ఫర్ ఫ్లైట్ అనే ఇతివృత్తంతో జరుపుకున్నాము. ఈ యేడు "పక్షుల సంరక్షణపై ప్రజలకు అవగాహనను పెంచడం " అనే థీమ్ తో నిర్వహించుకుంటున్నాము. ఈ రోజు పక్షుల సంరక్షణ మనుగడ పర్యావరణ సమస్యలపై దృష్టి సారించబడుతుంది.

ప్రమాదపు ముప్పులో పక్షులు : సాధారణంగా పక్షులను భూగ్రహం యొక్క ఆరోగ్యానికి బారోమీటర్ గా సూచిస్తారు. పక్షులు విత్తనవ్యాప్తిలో పరాగసంపర్కకారకాలుగా సహజ పారిశుద్ధ కార్మికులుగా పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ఇవి కీలకపాత్రను పోషిస్తాయి. ప్రకృతిలో కాకి గద్ద రాబందులను " ప్రకృతి యొక్క డస్ట్ బిన్ బాయ్స్ " అని అంటారు. పంటలను ఆశించే కీటకాలను తిని పక్షులు పంటలను రక్షించి రైతు మిత్రులుగా పేరొందినాయి .పక్షులు పర్యావరణ వ్యవస్థలో అసమాన ప్రభావాన్ని చూపే కీ స్టోన్ జాతులు . ఇవి ఆహారపు గొలుసు, ఆహారపు జాలకం లో భాగమై స్థానిక అవాసాలు అవరణవ్యవస్థ ( ఎకోసిస్టం ) నిర్మాణంలో ప్రధానపాత్ర వహిస్తాయి. పక్షుల మలం ద్వార పడిన గింజలు అడవుల్లో కొత్త మొక్కలుగా ఎదుగుతాయి.పక్షులు మానవునికి ముఖ్య ఆహారంగా ఉపయోగపడుతాయి . కావున వీటిని పర్యావరణ ఇంజనీర్లు అంటారు. వీటి పెంపకం సంరక్షణ మరియు వీక్షణం ( బర్డ్ వాచింగ్ ) బర్డ్ ఫోటోగ్రఫి వల్ల ద్రవ్యలాభము , వినోదం , మాసిక ఉల్లాసం బర్డ్ ఎకోటూరిజం అభివృద్ధిలతో పాటు ప్రజల్లో ఆనందం ప్రేమ ఆప్యాయత అనురాగం దయ పరోపకారం ఐక్యత అను మానవ విలువలు పెంపొందుతాయి . ప్రకృతి పట్ల గౌరవభావం పెరుగుతుంది . పర్యావరణ వ్యవస్థల దుర్బలత్వం మరియు పక్షుల ప్రమాదపరిస్థితులపై అవగాహన ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10906 పక్షి జాతులుండగా మన దేశంలో 1,353 జాతులున్నట్లు జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి . ఈ ప్రకారం ప్రపంచంలోని పక్షి జాతులలో 12 శాతం జాతులు భారత్ లో ఉన్నవి . ఇక మరే దేశంలోను కనిపించని 78 రకాల పక్షిజాతులు మన దేశంలో మాత్రమే కనిపిస్తాయి . వీటిలో 25 శాతం మనుగడప్రమాదంలో ఉన్నాయని మనదేశానికి వచ్చే విదేశీ వలస పక్షి జాతుల్లో 29 జాతులు ప్రమాదం అంచులో ఉన్నట్లు , 15 జాతులు దాదాపు అంతరించే దశలో ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి . మన దేశంలో బట్టమేకల పక్షి అంతరించిపోయే స్థితిలో ఉందని ప్రస్తుతం 150 పక్షులు మాత్రమే ఉన్నాయని హై వోల్టేజ్ విద్యుత్ తీగలు వీటికి ప్రాణాంతకంగా మారినాయని కేంద్ర పర్యావరణ శాఖ ఇటివల పేర్కొంది. ప్రతి 8 పక్షుల జాతులలో ఒకటి అంతరించి పోయే దశలో ఉన్నాయని స్టేట్ ఆఫ్ ది వరల్డ్ 2022 -23 నివేదిక పేర్కొంది . మన దేశంలో గ్రేట్ఇండియన్ బస్టర్డ్ , రెడ్ హెడ్ రాబందు ,అడవిగుడ్లగూబ ,బిల్డ్ సాండ్ పైపెర్ , జెర్డాన్ కోర్సర్ ,బెంగాల్ ఫ్లోరికన్, వైట్ బెల్లీ హెరాన్, హిమాలయ పిట్ట ల్యాప్ వింగ్ పక్షి , సైబీరియన్ క్రేన్,ఎల్లో బ్రెస్ట్ బంటింగ్ పక్షులు అంతరించే దశలో ఉన్నాయని రెడ్ డేటా బుక్ గణాంకాలు తెలుపుతున్నాయి. వచ్చే శతాబ్దంలో 1200 జాతులు అంతరించి పోయే ప్రమాదం ఉన్నట్లు , 200 జాతులు ఇప్పటికే అంతరించి పోయినట్లు వరల్డ్ వాచ్ సంస్థ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. అసాధారణ వాతావరణ మార్పులు భూతాపం జనాభా విస్ఫోటనం, తరుగుతున్నఅడవులు కార్చిచ్చులు ఆహారం నీటి కొరతలు తీవ్ర రేడియేషన్ ప్రభావం, అయస్కాంత ప్రభావం విపరీతమైన ధ్వని, గాలి నీటి కాలుష్యం , మిరుమిట్లు గొలిపే కాంతి పురుగుమందులు మరియు ఎరువుల అధిక వినియోగం ,పక్షుల వేట అను అంశాలు పక్షుల అంతానికి కారణమవుతున్నాయి . జీవనగమనంను నేర్పే పక్షులను కాపాడటం మానవుని కర్తవ్యం అని చెప్పిన భారత పక్షిశాస్త్ర పితామహుడు సలీంఅలీ మాటలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి.

సలీంఅలీ కృషి స్ఫూర్తిదాయకం : గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ అఫ్ ఇండియన్ ఆర్నిథాలజీ ( పురాతన భారతీయ పక్షి మానవుడు) గా పేరు గాంచిన డాక్టర్ సలీం అలీ మన దేశంలో క్రమబద్ధమైన శాస్త్రీయమైన పక్షుల సర్వేలను నిర్వహించిన మొట్టమొదటి భారతీయులలలో ఒకరు. ది బుక్ అఫ్ ఇండియన్ బర్డ్స్ పుస్తకంను రచించిన మహారాష్ట్రకు చెందిన ఆయన పక్షుల సంరక్షణ కొరకు జీవితాంతం పనిచేసాడు. మన దేశంలో భరత్ పూర్ పక్షుల అభయారణ్యం ఏర్పాటులో మరియు సైలెంట్ వ్యాలి నేషనల్ పార్క్‌ను నాశనం చేయకుండా నిరోదించడంలో ముఖ్యపాత్ర పోషించాడు. అయన స్ఫూర్తిగా ఈనాడు ప్రజలు పాలకులు పక్షుల సంరక్షణకు పాటుపడవల్సిన అవసరం ఉంది. నేడు అవాసాల నష్టం మరియు విధ్వంసం వాతావరణ మార్పులు అనేవి పక్షులు ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన ముప్పుగా ఉన్నాయి . కనుక పక్షుల సంరక్షణకు పక్షినిపుణులు పలు పద్ధతులు అభివృద్ధి చేశారు. పక్షుల జాతులను సంరక్షించడానికి క్యాప్టివ్ బ్రీడింగ్ పాపులేషన్ పద్ధతి అనుసరించి అంతరించి పోతున్న జాతులను తిరిగి నింపడానికి , కొత్త జనాభాను సృష్టించడానికి , అంతరించి పోతున్న ఒక జాతిని పునరుద్దరించడానికి ఉపయోగపడుతుంది . వలస పక్షుల మార్గాలను కాలనుగుణతను తెలుసుకోవడానికి అగ్మెంటేడ్ రియాలిటి సాంకేతికతను వినియోగించాలి . అంతరించి పోతున్న జాతుల డేటా ను సేకరించడానికి జిపిఎస్ ట్రాకింగ్ సాటిలైట్ టెక్నాలజీ ని మరియు రిమోట్ ప్రాంతాలలో పక్షుల గుర్తింపు, సంరక్షణల కొరకు, సర్వేల కొరకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మెషిన్ లర్నింగ్ టెక్నాలజి సాధనాలను అందుబాటులోకి తేవాలి. బర్డ్ కౌంట్ ఇండియా సంస్థ నిర్వహించే ఈ ? బర్డ్ మొబైల్ ఆప్ ను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారంలోకి తేవాలి. పక్షుల ఉనికి శబ్దాలు ప్రవర్తనలను తెలియపరిచే బయో అకాస్టిక్ మానిటరింగ్ విధానంను అమలులోకి తేవాలి. జాతీయ ఉద్యానవనాలు కమ్యూనిటి రిజార్వ్ లు రక్షిత ప్రాంతాలు గడ్డి మైదానాలను ఇతోధికంగా అభివృద్ధి పరచాలి.

రంసర్ కన్వెన్షన్ నిబంధనల మేరకు బురద ప్రాంతాలను పరిరక్షించాలి. ప్రజలకు పక్షుల పట్ల సానుభూతి , ఆసక్తిని పెంపొందిచే విధంగా అవగాహన కల్పించడంతో పాటు అక్రమ వ్యాపారం అవాసాల విధ్వంసం లను అరికట్టడానికి వన్యప్రాణి సంరక్షణ చట్టం -1972 అమలుతో పాటు అధునాతన పక్షుల సంరక్షణ చట్టాలను తెచ్చికఠినంగా అమలు పరచాలి. అప్పుడే ప్రమాదపు ముప్పులో ఉన్న పక్షులు సుదీర్ఘ కాలం భూమిపై మనగలుగుతాయి . ఈ సందర్భంగా "పక్షి లేని ప్రపంచంలో ఏ మానవుడు జీవించలేడు " అని చెప్పిన అమెరికన్ పక్షి ప్రేమికుడు రిచర్డ్ స్మిత్ మాటలను మనం ఎన్నడూ మరువరాదు.

# కుంభమేళకు టీటీడీ ప్రచార రథాలు

తిరుమల : యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహా కుంభమేళాకు తిరుమల శ్రీవారి కళ్యాణ రథం బయలుదేరింది. ఐఆ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేక పూజల అనంతరం ఈ రథం బయలుదేరింది. జనవరి 13 కుంభమేళా ప్రారంభం రోజు నుంచి ఫిబ్రవరి 26 కుంభమేళా పూర్తయ్యేవరకూ ఉత్తరాధి భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన 2.5 ఎకరాల స్థలంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేశామని చెప్పారు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు. 170 మంది సిబ్బందితో తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలు నిర్వహిస్తామన్నారు. కలియుగ ప్రత్యక్షదైవంగా పూజలందుకున్న శ్రీ వేంకటేశ్వరుడి దర్శనభాగ్యం దక్షిణాది భక్తులకు కల్పిస్తామని తెలిపారు. జనవరి 18, 26, ఫిబ్రవరి 3, 12 తేదీల్లో శ్రీనివాసుడి కళ్యాణోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్లకు ఓసారి జరిగే కుంభమేళా 2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ జరగనుంది. ఈ మేరకు యూపీ సర్కార్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో జనవరి 14 మకర సంక్రాంతి, జనవరి 29 మౌని అమావాస్య, ఫిబ్రవరి 3 వసంత పంచమి సందర్భంగా భక్తులు భారీగా పోటెత్తనున్నారు. అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకకు బెదిరింపులు రావడంతో ఏడంచెల భద్రతా చర్యలు చేపట్టింది యూపీ సర్కార్. మరోవైపు వైకుంఠ ద్వార దర్శనాల గురించి తిరుమలలో అన్నమయ్య భవనంలో మీడియా సమావేశంలో మాట్లాడారు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు. ప్రపంచ వ్యాప్తంగా హిందువులు వైకుంఠ ద్వార దర్శనం గూర్చి మాట్లాడుతున్నారని... పది రోజుల పాటూ టీటీడీ దర్శనాలు ఏర్పాటు చేసిందని చెప్పారు. జనవరి ఉదయం 10 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచే సర్వదర్శనాలకు భక్తులను అనుమతిస్తామన్నారు. కేవలం వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే అనుమతిస్తామన్నారు. జనవరి 10వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటలవరకూ స్వర్ణరథంపై స్వామివారు దర్శనమిస్తారు. వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాల సందర్భంగా ఈ పది రోజుల పాటు ప్రత్యేక సేవలు రద్దుచేశామని చెప్పారు బీఆర్ నాయుడు. వీఐపీలు నేరుగా వస్తే దర్శనానికి అనుమతిస్తాం కానీ..సిఫార్సు లేఖలు అనుమతించబోం అని మరోసారి స్పష్టం చేశారు. వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట వేయాలనే ఈ నిర్ణయం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. మైసూర్ నుంచి వచ్చిన నిపుణులతో చేయించిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతోందన్నారు. 3 వేల కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇక గోవిందమాల భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండవని..అందరి భక్తులతో పాటూ ాాఆ టోకన్లు తీసుకొని వైకుంఠద్వార దర్శనాలకు రావాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలకు భక్తులను అనుమతించే విషయంలో ఎలాంటి అసత్య ప్రచారాలు నమ్మొద్దని టీటీడీ ఛైర్మన్ పిలుపునిచ్చారు. ఇక ఊఓఖఎ అనే కొత్త రకమైన వైరస్ ప్రబలుతున్నందున భక్తులు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆగని రేషన్ బియ్యం దందా

విజయవాడ : సీజ్ ద షిప్ డ్రామా ముగిసింది. రేషన్ బియ్యం పట్టుబడిన స్టెల్లా నౌక కాకినాడ పోర్టు విడిచిపోయింది. రేషన్ బియ్యం అక్రమాలు మాత్రం ఆగలేదు. కొద్ది నెలల క్రితం చోటు చేసుకున్న హంగామాతో రేషన్ బియ్యం ధర మాత్రం కిలోకు రెండు రుపాయలు పెరిగింది ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేస్తామంటూ చేసిన హంగామా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఊరూరా రేషన్ బియ్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోర్టుల్లో తనిఖీలు, మిల్లుల్లో సోదాలతో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు అడ్డు కట్ట పడుతుందని భావించినా అందుకు భిన్నంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఉంది. గతంలో దొంగచాటుగా సాగిన వ్యవహారం ఇప్పుడు బహిరంగంగానే సాగుతోంది. ఊరూరా మొబైల్ డెలివరీ యూనిట్లలోనే బియ్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. గతంలో సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారనే భయం కాస్తో కూస్తో ఉండేది. ప్రస్తుతం ఆ భయం కూడా పోయింది.ఏపీలో మూడు నెలల క్రితం రేషన్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారాలపై జరిగిన హంగామాతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడుతుందని భావించారు. కాకినాడ పోర్టులో పవన్ కళ్యాణ్ సీజ్ ద షిప్ ఎపిసోడ్‌తో ఈ దందాకు అడ్డుకట్ట పడినట్టే అనుకున్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా తనిఖీలు చేసిన స్టెల్లా నౌకకు సైతం కస్టమ్స్ క్లియరెన్స్ లభించడంతో సోమవారం బయల్దేరి వెళ్లిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపార సిండికేట్లు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రతి జిల్లాలో మండలాల వారీగా రేషన్ దుకాణాలను నడిపించే అక్రమ సిండికేట్లలో కొత్త ముఖాలు ప్రవేశించాయి. ఇప్పటి వరకు ఈ తరహా దందాలు నడిపిన వ్యక్తుల చేతుల్లోంచి కొత్త వ్యక్తులు వాటిని దక్కించుకున్నారు. ప్రతి మండలంలో ఉన్న రేషన్ దుకాణాలను అధికార పార్టీల నేతలు అనుచరులు తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తినడానికి వినియోగించే సన్న రకాలు కాకపోవడంతో రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ లెక్కల ప్రకారం కోటి 55లక్షల కుటుంబాలు ఉంటే అందులో కోటి 48లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి నెలకు 5 కేజీల చొప్పున బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న కార్డులకు బియ్యం పంపిణీ కోసం ఏటా 30లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతున్నాయి. వీటిలో 80శాతానికి పైగా పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఒక్కో కిలో బియ్యం సేకరించి కార్డులకు అందించడానికి రూ.43.50ఖర్చు చేస్తుంటే ఆ బియ్యాన్ని రూ.10-12కు అమ్మేస్తున్నారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం హడావుడి మొదలయ్యాక ఆ ధర రూ.2మేరకు పెంచి కొనుగోలు చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీలో కోటి 48లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 92లక్షల కార్డులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రేషన్ అందుతోంది. మరో 56లక్షల కార్డుల్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రేషన్ కార్డులకు అందించే బియ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5700కోట్లను వెచ్చిస్తోంది. కేంద్రం ఇచ్చే వాటాతో కలిపితే అది రూ.13వేల కోట్లకు చేరువలో ఉంటుంది. రేషన్ కార్డులతోనే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్?, డిబిటి పథకాలను ముడి పెట్టడంతో ఏదో ఒక మార్గంలో రేషన్ కార్డును దక్కించుకుంటున్నారు.చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందించే బియ్యాన్ని 90శాతం మంది ఆహారంగా వినియోగించడం లేదు. ప్రభుత్వం బోనస్ కలిపి రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని పేదలకు ఆహారంగా సరఫరా చేస్తోంది. ఇలా కిలోకు రూ.43.50 ఖర్చవుతోంది. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారికి 20కిలోల బియ్యం ప్రభుత్వం రైస్ కార్డుపై ఇస్తోంది. అంటే నెలకు ఒక్కో కుటుంబానికి రూ.870 ఖరీదైన బియ్యం అందుతోంది.ఇదే బియ్యాన్ని కార్డు దారుడు తీసుకోకుండా రేషన్ దుకాణాలు, మొబైల్ వాహనాలకే వదిలేస్తే కిలోకు రూ.10-12 కార్డుదారుడికి చెల్లిస్తున్నారు. కార్డులో నలుగురు సభ్యులు ఉంటే బియ్యంకు బదులుగా రూ.200 వారికి ఇస్తున్నారు.ఏడాదికి సగటున రూ.10,440 విలువైన బియ్యాన్ని రూ.2400కు అమ్మేసుకుంటున్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి నెల 3,24, 797 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డులకు చెల్లిస్తున్నారు. ఇందులో బీపీఎల్ కార్డులు, ఏపిఎల్ కార్డులు, అంత్యోదయ అన్న యోజన కార్డులు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, మిడ్ డే మీల్స్, అన్నపూర్ణ స్కీమ్, అదనపు ఏపిఎల్ కార్డులు ఉన్నాయి. మొత్తం 3.24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంలో 80శాతం పైగా తిరిగి బ్లాక్ మార్కెట్లకే చేరుతోంది. ఏడాదికి రూ.25లక్షల టన్నుల బియ్యం ఇలా పోర్టుల నుంచి తరలిపోతోంది. దీని ద్వారా నేతలు కళ్లు చెదిరేలా సంపాదిస్తున్నారు.రేషన్ కార్డు దారుల నుంచి రూ.10కు కొనుగోలు చేసే బియ్యాన్ని దళారులు రూ.16-18కు మండల, జిల్లా స్థాయి విక్రేతకు అందిస్తారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం మాఫియాను నియంత్రించే నాయకులు ఉన్నారు. రేషన్ వాహనాలు, దుకాణాల నుంచి బియ్యాన్ని నేరుగా వీరికి అందిస్తారు. ఒక్కో మండలంలో నెలకు సగటున 250-300 మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్లకు తరలిపోతోంది. ప్రతి నెల రెండున్నర లక్షల కిలోల నుంచి 3లక్షల కిలోల బియ్యాన్ని రేషన్ మాఫియా సొమ్ము చేసుకుంటుంది.జిల్లా స్థాయి మాఫియా నుంచి మధ్య తయారీ దారులు, ఎగుమతి దారులకు చేరే సరికి దాని ధర గరిష్టంగా రూ.36-38కు చేరుతోంది. రేషన్ కార్డుదారుడికి రూ.10 దక్కితే అదే బియ్యం మిధ దళారులు కిలోకు రూ.26-28వరకు సంపాదిస్తున్నారు. ఫలితంగా అన్ని రాజకీయ పార్టీలకు రేషన్ బియ్యం మిఠాయిలా మారింది.ప్రభుత్వం మారిన వెంటనే రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. వాస్తవానికి రేషన్ దుకాణాలు, బియ్యం తరలింపు దందా మాత్రమే చేతులు మారింది. గత ఆర్నెల్లలో గతంలో ఉన్న వారి స్థానంలో కొత్త దళారులు పుట్టుకొచ్చారు.ఒక్కో రేషన్ దుకాణంలో ప్రతి నెల లక్షల రుపాయలు ఆదాయం కనిపిస్తుండటంతో చోటా మోటా నాయకులు తమ ప్రాంతంలో రేషన్ దందా కోసం ముఖ్యమైన నేతల్ని ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ డెలివరీ యూనిట్లతో బియ్యం రవాణా చేస్తుండటంతో బ్లాక్ మార్కెటింగ్ యథేచ్ఛగా సాగుతోంది.

## తమ్మినేని దారెటు...

శ్రీకాకుళం : ఏపీ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు తమ్మినేని సీతారాం. ఇప్పటి వరకు 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమ్మినేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలక శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. వైసీపీ సర్కార్‌లో శాసన సభాపతిగా కూడా పనిచేశారు. రాజకీయాల్లో తలపండిన నేతగా పేరు తెచ్చుకున్నారు తమ్మినేని.. అలాంటి సీనియర్ నేతను ఇప్పుడు సోషల్ మీడియా ముప్పుతిప్పలు పెడుతుందనే గాసిప్ మొదలైంది.ఎంత అనుభవం ఉన్నా కాలం కలిసి రాకుంటే. ఎవరైనా డీలా పడాల్సిందే. అలా వైసీపీ ఓటమి తర్వాత తమ్మినేని కూడా ఇబ్బందులుపడుతున్నారు. 2024 ఎన్నికల్లో తమ్మినేని సీతారాం ఓటమి తర్వాత సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించి శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది హైకమాండ్. ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చింతాడ రవికుమార్‌ని నియమించారు.ఇక అప్పటి నుంచి తమ్మినేనితో పాటు ఆయన వర్గం అసంతృప్తిగా ఉన్నారనే టాక్ లోకల్‌లో రీసౌండ్ చేస్తోంది. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరిగినా.. ఎక్కడా తమ్మినేని కనిపించడం లేదు. ఆమదాలవలస వైసీపీ పగ్గాలను తమ్మినేని వారసుడు వెంకట చిరంజీవి నాగ్‌కి అప్పగిస్తారని లోకల్‌లో తెగ ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో అధిష్టానం చిరంజీవినాగ్‌ను కాదని చింతాడ రవికుమార్‌కు బాధ్యతల్ని అప్పగిచారు. దీంతో అప్పటి నుంచి వైసీపీ అధిష్టానంపై తమ్మినేని కుటుంబం కాస్త గుర్రుగానే ఉందని గాసిప్ వినిపిస్తోంది.సోషల్ మీడియా వచ్చి దూరం అనే మాటను చెరిపేసింది. ప్రపంచాన్ని సింగిల్ విలేజ్‌గా మార్చేసింది. ఎక్కడా ఏ మూలనా ఏం జరిగినా ప్రపంచమంతా చాటి చెబుతుంది. ఈ సోషల్ మీడియా ఓడలను బండ్లను చేయగలదు. బడ్లను ఓడలను చేయగలదు. చాలా మంది సోషల్ మీడియాను బ్రహ్మాస్త్రంగా వాడుకొని పొలిటికల్ లీడర్లుగా ఎదిగిపోయారు. అయితే అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నిజాన్ని అబద్ధం డామినేట్ చేస్తోంది. సత్యం డిలేట్ అయిపోయి అసత్యం ఫార్వర్డ్ అవుతుంది. ఇలా ఇప్పటి వరకు ఎంతోమంది నేతలు చిక్కుల్లో పడ్డారు.ఇది ఇలా సాగుతుంటే రెండు నెలలుగా వైసీపీ క్యాడర్‌కి సైతం తమ్మినేని టచ్‌లోకి రావడం లేదట. నిజం చెప్పాలంటే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారా అనే అనుమానం లోకల్ కార్యకర్తలకు కూడా కలిగింది. ఇక్కడే తమ్మినేనికి అసలు చిక్కువచ్చి పడింది. సీతారాం పార్టీ మారబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కొన్ని సోషల్ మీడియా సంస్థలు ఒక్క అడుగు ముందుకేసి.. తమ్మినేని జనసేన వైపు చూస్తున్నారని కొందరు.. లేదు లేదు బీజేపీ ఆఫీస్ బాట పడతారని ఇంకొందరి తమ్మినెయిల్ తగిలించి వీడియోలు వదిలేశారు. ఇక ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. తమ్మినేని కూడా టచ్‌లో లేకపోవడంతో వైసీపీ క్యాడర్ కూడా ఇదే నిజమే అని ఫిక్స్ అయ్యారట.రెండు నెలల సుదీర్ఘ విరామం తర్వాత సిక్కోలు జిల్లాకు ఎంట్రీ ఇచ్చిన సీతారాం.. సోషల్ మీడియా ప్రచారం చూసి షాక్ ఐపోయారు. తానేంటి పార్టీ మారడం ఏంటని తల పట్టుకుంటున్నారట. ఇంతలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆమదాలవలసలో సీతారాం ఇంటికి వెళ్లడంతో ఏదో జరుగుతుందనే అనుమానం మరింత బలపడింది. తమ్మినేని పార్టీ మారబోతున్నారని.. ఆయన్ని బుజ్జగించేందుకే స్వయంగా బొత్స వచ్చారంటూ సిక్కోలు పొలిటికల్ సర్కిళ్లలో పుకార్లు షికార్లు చేశాయి.తాను పార్టీ మారడం లేదు మహా ప్రభో అంటూ తమ్మినేని క్లారిటీ ఇచ్చేశారు. తన కుమారుడి ఆపరేషన్ కోసం వేరే రాష్ట్రానికి వెళ్లాల్సిం వచ్చిందని వివరణ ఇచ్చారు. అందుకే పార్టీ క్యాడర్‌కి టచ్‌లోకి రాలేదని చెప్పుకువచ్చారు. పీకపోయినా ఎవరైనా పవన్‌కల్యాణ్ వైపు వెళ్తారా అంటూ వివరణ కూడా ఇచ్చారట. ఇటు బొత్స సత్యనారాయణ కూడా తమ్మినేని కుమారుడి ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికే వచ్చానని చెప్పుకువచ్చారు.

తమ్మినేని మనసులో ఏముందో గాని.. సోషల్ మీడియా మాత్రం ఆయనికి కంటిమీద కునుకులేకుండా చేసింది. వైసీపీ క్యాడర్‌నే నమ్మించేంతలా ప్రచారాన్ని ఊదర గొట్టింది. అయితే నిప్పు లేనిదే పొగ రాదనే ప్రచారం మళ్లీ మొదలైంది. మొత్తానికి ఈ ఎపిసోడ్‌లో సోషల్ మీడియా అంచనాలు తలకిందులవుతాయా. లేదంటే నిజమే అవుతాయా.? అన్నది కాలమే నిర్ణయించాలి.

## కృష్ణా, గోదావరి నేతల మిస్సింగ్

విజయవాడ : అధికారం కోల్పోయాక ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల్లో వైసీపీని నడిపించే నాయకుడు లేడన్న చర్చ ఏపీ పాలిటిక్స్‌లో జోరుగా నడుస్తోంది. ఆ జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా తయారు అయిందట. వైసీపీ అధికారం చేజారిపోగానే.. బాలారిష్టాలు మొదలయ్యాయి. ఆ జిల్లాల్లో పార్టీని నడిపించే నాయకులు కరువవుతున్నారు.ఒక్కో నాయకుడిని ఏదో ఒక కేసు వెంటాడుతోంది. తెరమరుగైన కేసులను కూటమి ప్రభుత్వం తిరగతోడుతుండడంతో కొందరు వైసీపీ నేతలకు అరెస్టు భయం పట్టుకుంది. ఇందులో ప్రధానంగా మూడు కేసులు వైసీపీ నేతలను ఉక్కబోతకు గురిచేస్తున్నాయి. చంద్రబాబు ఇంటిపై దాడి, మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాల్లో విధ్వంసం కేసులో పలువురు నేతలు నిందితులుగా ఉన్నారు.ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పలువురు నేతలు టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాత జీవితమే గడుపుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమ నోటికి పని చెప్పిన మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇప్పుడు ఎక్కడున్నారో తెలియదు. మాజీ మంత్రి కొడాలిపై నమోదైన రెండు కేసుల్లో కోర్టు బెయిల్ మంజూరు చేసినా, ప్రభుత్వం ఇంకేదైనా కేసులో ఇరికించి లోపల వేస్తుందనే భయంతో కొడాలి నాని కనిపించకుండా తిరుగుతున్నారని లోకల్ టాక్.ఇక గన్నవరంలో టీడీపీ ఆఫీస్‌లపై దాడి కేసులో వల్లభనేని వంశీకి అరెస్ట్ తప్పేలా లేదు. చాలా కాలంగా ముందస్తు బెయిల్‌పై ఉన్న వంశీ.. ఇప్పుడు బెయిల్ రద్దు కావడంతో అరెస్ట్ ఖాయమనే గాసిప్ కృష్ణా జిల్లాలో బిగ్ సౌండ్ చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వంశీ ముఖ్య అనుచరులు రిమాండ్‌లో ఉన్నారు. దీంతో వైసీపీ ఓటమి పాలైనప్పటి నుంచి వంశీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఒకటి రెండు సందర్భాల్లో మినహా ఆయన బయట కనిపించింది లేదు. దీంతో గన్నవరంలో ఆరునెలలుగా వైసీపీ జెండా ఎక్కడా కనరావడం లేదు. దీంతో క్యాడర్ అయోమయస్థితిలో పడిపోయింది.ఎన్నికల్లో ఓటమి తర్వాత కృష్ణా జిల్లాలో కీలకమైన అధ్యక్ష బాధ్యతల్ని పేర్ని నానికి అప్పగించింది వైసీపీ అధిష్టానం. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికి, పేర్ని నాని రేషన్ బియ్యం స్కాంలో ఇరుకున్నారు. కేసుల ఎఫెక్ట్‌తో స్పీడ్ తగ్గించేసి కామ్ అయిపోయారు పేర్ని నాని.గన్నవారానికి వల్లభనేని వంశీని, గుడివాడకు కొడాలి నానిని , మచిలీపట్నానికి పేర్ని నానిని ఇన్చార్జులుగా కొనసాగిస్తున్నట్లు జగన్ ప్రకటించినా కేసుల భయంతో ముగ్గురూ క్యాడర్‌కి అందుబాటులో లేకుండా పోయారు. పెడన, పెనమలూరు నియోజకవర్గాల్లో తిరిగి కొత్త వారికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వారు కూడా కనిపించడం లేదని వైసీపీ కార్యకర్తలు ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం నియోజకవర్గాన్ని వీడిన వల్లభనేని వంశీ, గుడివాడకు దూరమైన కొడాలి నాని ఇప్పటివరకు ఎక్కడున్నారో తెలియదు. ఎప్పుడొస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొందిఇక గుంటూరు జిల్లా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.

మరియమ్మ హత్యకేసులో అరెస్టైన నందిగం సురేశ్.. తన పాత కేసుల వివరాలను దాచిపెట్టారన్న కారణంతో ట్రయల్ కోర్టు ఆయనకు బెయిల్ నిరాకరించింది. దీంతో సుప్రీంకోర్టు కూడా తాము జోక్యం చేసుకోలేమని చెప్పింది.ఇలా చెప్పుకుంటూ పోతే గుంటూరు, కృష్ణా జిల్లాల నేతలు గడప దాటి అడుగు బయట పెట్టడం లేదట. పార్టీ పిలుపునిచ్చిన కార్య క్రమాలకు సైతం వారు దూరంగా ఉంటున్నారు. చివరకు పార్టీ ప్రతిష్టాత్మకంగా పిలుపునిచ్చిన రైతు సమస్యలతో పాటు విద్యుత్ చార్జీలకు పెంపుదలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనల్లోనూ వారు కనిపించలేదు.ఇలానే కంటిన్యూ అయితే భవిష్యత్తులో పార్టీ పరిస్థితి ఏంటి అని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారంట. రాజకీయాల్లో కేసులు, అరెస్టులు సర్వసాధారణం. కానీ క్యాడర్‌కు భరోసా కల్పించలేని స్థితిలో కీలక నేతలే ఇలా సైలెంట్‌గా ఉంటే భవిష్యత్తులో పార్టీ జండా మోసేదెవరు..? పార్టీ, కార్యక్రమాలకు వచ్చేది ఎవరు, పార్టీని నడిపించేది ఎవరని కార్యకర్తలు పెదవి విరుస్తున్నారని పార్టీ ఇన్నర్ టాక్. మరి చూడాలి ఈ సమస్యని వైసీపీ హైకమాండ్ ఎలా చక్కబెడుతుందో..

## పక్క దారి పడుతున్న కందిపప్పు

నెల్లూరు : పేదలకు అందాల్సిన కందిపప్పు పక్కదారి పడుతోంది. చాలా ప్రాంతాల్లో కందిపప్పు సరఫరా తక్కువ అవుతోంది. దీంతో డీలర్లు కొంతమందికే ఇచ్చి.. మిగతా పప్పును వ్యాపారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 40 శాతం వరకు లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదని తెలుస్తోంది.సంక్రాంతి పండగ వేళ పేదలు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా కార్డుదారులకు ఇచ్చే సరఫరాలో కోత విధిస్తున్నారు. డిసెంబర్ నెలలో కూడా అరకొరగా పంపిణీ చేశారు. ఈ నెలలో అయినా అందరికీ ఇస్తారని అనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో కిందిపప్పు రాలేదు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతో పాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. కానీ.. రేషన్ షాపుల ద్వారా అవి సక్రమంగా అందడం లేదు.బియ్యం, పంచదార అందరికీ ఇస్తున్నా.. 50 నుంచి 60 శాతం మందికి మాత్రమే కంది పప్పు అందిస్తున్నారు. దీంతో 40 శాతానికిపై లబ్ధిదారులకు కందిపప్పు దక్కడం లేదు. రేషన్ దుకాణాలు ద్వారా రాయితీపోనూ రూ.67కే కందిపప్పు వస్తుంది. దీంతో పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు భారీగా పెరగడంతో.. కందిపప్పు ఇవ్వకపోతే ఎలా అని పేదలు ప్రశ్నిస్తున్నారు.రేషన్ షాపుల నిర్వాహకులు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇవ్వాలి. కానీ చాల చోట్ల బియ్యం, చెక్కర మాత్రమే అందిస్తున్నారు. కొంత మందికి మాత్రమే కందిపప్పు అందించి.. ఇక పప్పు అయిపోయిందని చెబుతున్నారు. అలా నొక్కేసిన పప్పును బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయిపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా అనేక రకాల అవసరమైన సరుకులు అందజేస్తున్నారు. తెల్ల బియ్యం, గోధుమలు, ప్రోటీన్లు అధికంగా ఉండే కందిపప్పు, పంచదార, వంట నూనెను కూడా అందిస్తున్నారు. అప్పుడప్పుడు అవసరాలను బట్టి ఉప్పు, మిరపకాయలను పంపిణీ చేస్తున్నారు.అయితే.. కొన్ని చోట్ల కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేస్తున్నారు. షాపుల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## రెరా నిబంధనల్ని సరళతరం

విజయవాడ : ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందేలా రెరా నిబంధనల్ని సరళతరం చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. విజయవాడలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కార్యాలయంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి, రెరా ఛైర్మన్ కన్నబాబు,రెరా సభ్యులు, అధికారులతో కలిసి మంత్రి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.క్రెడాయ్, నరెడ్కో ప్రతినిధులతో పాటు బిల్డర్లు, డెవలపర్లు,ప్రజల నుంచి మంత్రి నారాయణ స్వయంగా వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి పూర్తిగా వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెండింగ్ లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందో అధికారులను వివరణ అడిగారు.భవనాలు,ప్లాట్లు కొనుగోలుచేసేవారు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా చూడటమే రెరా లక్ష్యమని మంత్రి వివరించారు.కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్రంలో 2016లో రెరా చట్టం అమల్లోకి వచ్చిందని అప్పటి నుంచి కేంద్రం ఇచ్చిన నిబంధనలు రాష్ట్రంలో తూ,చ.తప్పకుండా అమలుచేసేలా ముందుకు వెళుతున్నామన్నారు.రెరాలో ఇప్పటివరకూ 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్నాయని కొన్ని దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి 30 మంది క్లయింట్లు, బిల్డర్లు, డెవలపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు.ఆయా దరఖాస్తుల కు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసినట్టు వివరించారు.పెండింగ్ అప్లికేషన్లు అన్నీ ఈ నెలాఖరులోగా క్లియర్ చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాలను కూడా కొన్ని పరిశీలించామని రెరా నిబంధనలు మరింత సరళతరం చేసేలా కమిటీ వేసి ముందుకెళ్తామన్నారు. రెరా అనుమతులు ఆఫ్ లైన్ లో కాకుండా ఆన్ లైన్ లో జరిగేలా త్వరలో మార్పులు చేస్తున్నామన్నారు.గత ప్రభుత్వంలో బిల్డర్లు,డెవలపర్లుతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారని రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది సీఎం లక్ష్యమని...అందుకు అనుగుణంగా భవన,లేఅవుట్ల అనుమతులను సరళతరం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను వచ్చే గురువారం జారీ చేస్తామని మంత్రి చెప్పారు. బిల్డర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.తణుకు,తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో వాటితో పాటు కొన్నాళ్లపాటు అన్నిచోట్లా బాండ్ల జారీ నిలిపివేసినట్టు చెప్పారు. తాజాగా ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన అన్నిచోట్లా పెండింగ్ లో ఉన్న టీడీఆర్ బాండ్లను జారీ చేస్తున్నామన్నారు. గత మూడు రోజులుగా ప్రతి రోజూ అన్ని మున్సిపాల్టీల కమిషనర్ లతో టీడీఆర్ బాండ్ల జారీపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారుతణుకులో టీడీఆర్ కుంభకోణంపై విచారణ పూర్తయిన తర్వాత సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వాటిలో 321 టీడీఆర్ బాండ్ల వెరిఫికేషన్ పూర్తయిందని, మరో 501 టీడీఆర్ ల వెరిఫికేషన్ జరగాల్సి ఉందన్నారు. విశాఖపట్నంలో 184, తిరుపతిలో 153, కర్నూలు లో 93, గుంటూరులో 120, కాకినాడలో 91, రాజమండ్రిలో 50, కడపలో 46,విజయవాడలో 30తో పాటు ఇతర కార్పొరేషన్ లలో మరికొన్ని పెండింగ్ లో ఉన్నాయన్నారు.మొత్తంగా 822 టీడీఆర్ లకు సంబంధించి ఈనెలాఖరుకల్లా జారీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.రాష్ట్రంలో అనధికారిక లే అవుట్లు చాలా వరకూ ఉన్నాయని, ఎక్కడెక్కడ ఎన్నెన్ని అక్రమ లే అవుట్లు ఉన్నాయనే దానిపై ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చిందన్నారు. అలాంటి అనుమతులు లేని లే అవుట్ల లో ప్లాట్లు కొనడం ద్వారా కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడతారన్నారు.మరోవైపు భవన,లేఅవుట్ల క్రమబద్ధీకరణపై కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

## జగన్ ఎఫెక్ట్.... మై హోమ్ లీజులు రద్దు

అనంతపురం : తనకు మీడియా సపోర్ట్ లేదంటూనే.. గత ఐదేళ్లుగా పాలన చేశారు జగన్. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం నుంచి చాలా రకాల ప్రయోజనాలు పొందింది ప్రధాన మీడియా. ఏపీ ప్రభుత్వం దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా గత ప్రభుత్వం అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ఏపీవ్యాప్తంగా ఉన్న లైమ్ స్టోన్ లీజుల విషయంలో పున సమీక్షిస్తోంది. అందులో భాగంగా మై హోమ్ గ్రూపునకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని భావిస్తోంది. వైసిపి ప్రభుత్వం అనంతపురం తో పాటు చాలాచోట్ల లైమ్ స్టోన్ లీజులను 50 ఏళ్ల వరకు మై హోమ్ గ్రూపునకు కేటాయించింది. వీటిని రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇది సంచలన అంశంగా మారింది.మై హోమ్ గ్రూపునకు చెందినదే టీవీ 9. గత ఐదేళ్లుగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించింది ఈ మీడియా. మై హోమ్ గ్రూప్ చైర్మన్ రామేశ్వరరావు, ఆయన కుమారుడు టీవీ9 మీడియాను వైసీపీకి అప్పగించినట్లు విమర్శ ఉంది. దాని ప్రతిఫలంగా రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలు లీజులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా టీవీ9 తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేసుకుంది. చంద్రబాబుతో పాటు లోకేష్ కు వ్యతిరేకంగా కథనాలు వండి వార్చింది. ఒకానొక దశలో వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడింది. కానీ యాజమాన్యం ఎటువంటి చర్యలకు దిగలేదు. అయితే నాడు వైసిపికి టీవీ9 మీడియాను అప్పగించడమే అందుకు కారణం.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మై హోమ్ గ్రూపునకు కేటాయించిన లీజులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే గ్రూప్ చైర్మన్ రామేశ్వరం తో పాటు ఆయన కుమారుడు చంద్రబాబును కలిశారు. లీజులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై చంద్రబాబు నుంచి ఎటువంటి స్పందన రాలేనట్లు సమాచారం. గతం మాదిరిగా చంద్రబాబు ఉదాసీనంగా వ్యవహరించే అవకాశం లేదు. ఈ విషయంలో పార్టీ యువనాయకత్వం ఆలోచన మరోలా ఉంది. ఇటువంటి వారి విషయంలో ఎంతవరకైనా ముందుకెళ్లాలని యువ నాయకత్వం భావిస్తోంది. అందుకే గనుల లీజు విషయంలో మై హోమ్ గ్రూపునకు డోర్ క్లోజ్ అయినట్లు సమాచారం. మరి టీవీ9 ద్వారా ఏపీ ప్రభుత్వంపై అదే దూకుడుతో ముందుకు వెళ్తారా? వెనక్కి తగ్గుతారా అన్నది చూడాలి.

## రైల్వే లైన్ కు అమరావతి రైతులు అడ్డు

విజయవాడ : అమరావతి రాజధాని నిర్మాణం పై ఫోకస్ పెట్టారు చంద్రబాబు . గత అనుభవాల దృష్ట్యా పనులు వీలైనంతవరకు వేగవంతంగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ముందుకు వస్తోంది. ఒకవైపు అమరావతి రాజధాని పనులతో పాటు సమాంతరంగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఈ విషయంలో కేంద్రం కూడా సానుకూలంగా ఉండడంతో పనులను పరుగులెత్తించాలని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ దీనికి అమరావతి రైతులుఅడ్డుపడుతుండడం విశేషం. ఇన్ని రోజులు చంద్రబాబు కోసం పరితపించిన వారు ఇప్పుడు వ్యతిరేకిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా గుంటూరు, విజయవాడ నగరాలను అనుసంధానం చేస్తూ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ లైను నిర్మించనున్నారు. నంబూరు జంక్షన్ గా చేయనున్నారు. తద్వారా అమరావతి రాజధాని నిర్మాణానికి రెండు నగరాలు అనుసంధానం కానున్నాయి. గుంటూరు వెళ్లే అవసరం లేకుండా చెన్నై తిరుపతి కూడా వెళ్ళిపోవచ్చు. ప్రస్తుతం ఈ రైల్వే లైన్ కు సంబంధించి సర్వే జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో అధికారులు భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి గాను నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అమరావతిని నిర్మించేందుకు 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణ ఎలా జరిగిందో.. అలానే తమ భూములు తీసుకోవాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కంచి కర్ల మండలంలో భూసేకరణ జరుగుతోంది. అయితే ఈ లైన్ ఏర్పాట్లు భాగంగా భూములు కోల్పోతున్న వారు తమ కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం కావాలని కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో రోడ్ల మరమ్మతులతో పాటు కొత్త రహదారులు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అధికారులకు షాక్ తగులుతోంది.ఒకవైపు వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేయాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2029 నాటికి పూర్తిస్థాయిలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలనతో పాటు సమాంతరంగా అమరావతి పై ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అమరావతి రైతుల నుంచి కొత్త కోరికలు వస్తుండడంతో.. ప్రభుత్వానికి షాక్ తగిలినట్లు అవుతోంది. అయితే ఈ కొత్త రైల్వే లైన్ విషయంలో రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో చూడాలి.

## సంక్రాంతి వేడుకలు శాంతియూతంగా జరుపుకోవాలి - ఎస్సై బి. విక్రమ్

మోర్తాడ్,(ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:



సంక్రాంతి పండగను శాంతియుతంగా జరుపుకోవాలని మోర్తాడ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. మండల కేంద్రమైన మోర్తాడ్ పోలీస్ స్టేషన్ లో సంక్రాంతి పండగ సందర్భంగా ఆయా గ్రామంలో యువకులు, విద్యార్థులు గాలిపటలు ఎగురావేయడానికి నిషేధిత చైనా మంజా ధరని ఉపయోగించారాదాని. దింతో చైనా మంజా ఏంతో హానికరంగా ఉంటుందని అన్నారు. దింతో గ్రామంలో ఉన్న కిరాణా షాపుల యజమానులు చైనా మంజా న అమ్మినట్టిలతే వారిపైన చర్యలు తీసుకొంటామని అన్నారు. అదే విదంగా గ్రామమలో ఉన్న యువకులు చిన్న పిల్లలు మిద్యా పైన జాగ్రత్తగా పాతంగిలు ఎగురావేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

## పడగల్ గ్రామంలో జొన్న పంటను పరిశీలించిన ఏఓ..

వేల్పూర్,(ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:

వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామంలో వివిధ పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారిని ఎస్.శృతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు యాసంగిలో జొన్న పంటలో



వచ్చు వివిధ పురుగులను గుర్తించడం జరిగింది. వాతావరణ దృశ్య జొన్న పంటలో పేను బంక అధికంగా ఉన్నట్టు గుర్తించడం జరిగింది. అని అన్నారు.పురుగు యొక్క ఉధృతి మొక్క అడుగుభాగంలో ఉండి రసాన్ని పీలుస్తుంది.తెగులు సోకిన మొక్కలు లేత పసుపు రంగులోకి మారి కుంగిపోతాయి.మొక్కలపై తేనె మంచు మరియు చీమలు ఉండటం అఫిడ్స్‌కు సూచన. ఇది చాలా గడ్డిలో కూడా సంభవిస్తుంది. పేను బంక నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా థయామెథాక్సామ్ (0.2 గ్రా) లేదా ఫ్లోనికామిడ్ (0.3 గ్రా) లేదా ఎసిటామిప్రిడ్ (లీటరు నీటికి 0.2) 15 రోజులకు ఒకసారి పంటపై పిచికారి చేసి పేనుబంకను నివారించవచ్చుఅని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.సాయిరాం రాజు, షేక్ షబ్బీర్, ప్రశాంత్ ,రైతులు రాజాముత్యం, రాజు, బొంబాయి గంగాధర్, జాన్, రాజేష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మీడియా పాత్ర కీలకమైనది

### -మండల తహసీల్దర్ అరిఫా

### మర్కుక్ మండల ఎస్ఐ ఓ.దామోదర్

గజ్వేల్ నియోజకవర్గం: 09 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండల కేంద్రంలోని మండల తహశీల్దార్ అరిఫా, ఎస్ఐ ఓ.దామోదర్, మండల మాజీ జెడ్పీటిసి మంగమ్మ



రామచంద్రం, మండల ఎంపీడీవో అబ్జాలుద్దీన్, మండల పిఆర్టియు అధ్యక్షులు శ్రీనివాస్ రావ్ లు కలసి తెలంగాణ కెరటం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.అనంతరం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ పాత్రికేయులు ప్రజా సమస్యల పట్ల అనునిత్యం పోరాటాలు చేస్తూ,ప్రజా సమస్యలు వెలికి తీసి వార్తల ద్వారా పరిష్కారం అయ్యే విధంగా చూస్తారని వారు కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లడంలో దినపత్రికలు కీలక పాత్ర వహిస్తాయని వాక్యానించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ గిరి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులుగా దేవులపల్లి మనోహర్ యాదవ్

గజ్వేల్:09 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి)



గజ్వేల్ నియోజకవర్గంలోని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులుగా దేవులపల్లి మనోహార్ యాదవ్ ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో దేవులపల్లి మనోహర్ యాదవ్ గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో బీజేపీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి నేతలు అందరితో కలిసి, సమన్వయంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మరియు మెదక్ పార్లమెంట్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కి, సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి కి మరియు గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకుల అందరికీ మరియు గజ్వేల్ పట్టణ బిజెపి కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.



## రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ కు ఘన స్వాగతం

నిజామాబాద్,( ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:

కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన పసుపు రైతులతో ముఖాముఖి చర్చ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, రాష్ట్ర విత్తానాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి లకు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు ఘన స్వాగతం పలికారు. కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య శాలువా ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు శాలువాలతో సత్కరించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత రైతుల తరపున పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డికి అందజేశారు పసుపు రైతుల కోసం పసుపు ఉడకపెట్టే యంత్రాలు, పసుపు డ్రమ్ములు, టార్పాలిన్స్ మొదలగు వాటిని ప్రభుత్వం సబ్సిడీ పై అందించాలని కోరారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పద్ధతిలో అందించిందని, ఇప్పుడు కూడా అలా సబ్సిడీపై అందించాలని రైతులు ఎదురుచూస్తున్నారని వినతి పత్రంలో విన్నవించారు. ఈపాంత రైతుల కోరికలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా కోదండ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్లు కొరిపెల్లి లింగారెడ్డి, భూత్ పురం మహిపాల్, జైడి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తక్కూరి దేవేందర్, కొమ్ముల రవీందర్, సుంకరి విజయ్, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగకు ఊరు వెళ్ళేవారికి పోలీస్ శాఖ కీలక సూచనలు..

### ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సింధు శర్మ వెల్లడి



నిజామాబాద్,( ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:

సంక్రాంతి పండగ సెలవులకు వెళ్లే ప్రజలు పోలీస్ శాఖ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ వెల్లడించారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకుండా బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలి. ఊరెళ్తున్నామన్నా విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దు.డోర్స్ కు సెంట్రల్ లాకింగ్ సిస్టం వాడండి. గ్రామాలలోని ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం ఇవ్వండి. సి.సి కెమెరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు చూసుకుంటు ఉండండి. అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయాలన్నారు.శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడటం జరుగుతుంది. అట్టి వారిపై నిఘా ఏర్పాటు చేయించవలెనని తెలియజేశారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పండి. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది. ఇంట్లో కుటుంబ సభ్యులు వెళ్లగా ఉన్న మహిళలు, వృద్ధులు అపరిచితులు సమాచారం పేరుతో వస్తే నమ్మకండి.కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి. తాళం వేసి ఊరు వెళ్లే ముందు మీ సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలన్నారు.

పోలీస్ శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించండి. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించండి. లేదా డయల్ 100 ను సద్వినియోగం చేసుకోవాలని పలు సూచనలను తెలియజేశారు.

## రాయపోల్ బిజెపి నూతన మండల అధ్యక్షులుగా మంకిడి స్వామి

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి జనవరి 09.

రాయపోల్ మండల బిజెపి నూతన అధ్యక్షులుగా మంకిడి స్వామిని ఎన్నుకోవడం జరిగిందన్నారు రాయపోల్ బిజెపి పార్టీ మండల అధ్యక్షులుగా మంకిడి స్వామి, నియామకమయ్యారు. ఈ సందర్భంగా మంకిడి స్వామి మాట్లాడుతూ రాయపోల్ మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్నాథ్ సారంగుల,

అలాగే సహకరించిన రాయపోల్, మండల నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. నా పై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు మా కర్తవ్యాలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తామన్నారు. రాయపోల్ మండలంలో ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను మండల నాయకులు మమేకం చేసుకుంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అలాగే పార్టీ కార్యక్రమాలను పార్టీ ఆదేశించిన



బాధ్యతలను శిరసావహిస్థామని తెలియజేస్తున్నామన్నారు.

# కేసీఆర్ రంగంలోకి దిగాల్సిందేనా ?

హైదరాబాద్ : కేసీఆర్ అంటేనే ఒక పొలిటికల్ వైబ్రేషన్. ఏ చిన్న అవకాశం ఉన్నా చొచ్చుకుని పోయే రాజకీయ దూకుడు ఆయన సొంతం. అయితే కేసీఆర్ లోని ఈ దూకుడుని చూసి చాలా కాలం అయింది అని అంటారు. ఆయన 2014లో సీఎం అయ్యాక కాస్తా రిలాక్స్ అయ్యారని చెబుతారు. ఇక 2018లో ముందస్తు ఎన్నికల సమయంలో ఆయన ప్రచారంలో కొత్త వ్యూహాలు రచించారు. 2023లో మాత్రం ఆయన వ్యూహాలు అయితే పెద్దగా ఫలించలేదు. గత పదేళ్ళుగా చూస్తే కనుక ఎన్నికల సమయంలో తప్ప కేసీఆర్ పెద్దగా కనిపించింది తక్కువ అని అంటారు. పార్టీ సైతం అధికారంలో ఉండడంతో కేసీఅర్ కి పెద్దగా పని లేకుండా పోయిందని అంటున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే బీఆర్ఎస్ కి 2023 ఎన్నికలు చేదు ఫలితాలు ఇచ్చాయన్న సంగతి తెలిసిందే. మాజీ సీఎం గా కేసీఅర్ మిగిలిపోయారు. ఆయన ఈ ఓటమి తరువాత పెద్దగా అయితే కనిపించడం లేదు అని అంటున్నారు. ఆయన ఎక్కువగా ఎర్రవల్లిలోని ఫాం హౌస్ లోనే ఉంటున్నారు అని ప్రచారం సాగింది. ఇదిలా ఉంటే కేసీఆర్ ఇపుడు రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైంది అని అంటున్నారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఅర్ బీఆర్ఎస్ ని గత ఏడాది కాలంగా నడిపిస్తున్నారు. ఆయనతో పాటు మేనల్లుడు హరీష్ రావు కూడా పార్టీకి అండగా ఉన్నా ఫోకస్ అంతా కేటీఆర్ మీదనే ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. అటువంటిది కేటీఆర్ ఇపుడు కేసులను ఎదుర్కొంటున్నారు కేటీఆర్ ఫార్ములా ఈ కారు రేసు కేసులో అరెస్ట్ అవడం కచ్చితమని అంటున్నారు. దానికి మానసికంగా బీఆర్ఎస్ అగ్ర నేతలు సిద్ధమైపోయారు అని అంటున్నారు. ఇక ఈ కేసులో కేటీఆర్ ని ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై బయటపడడానికి ఏ విధంగా చేయవచ్చు దానికి తీసుకునే టైం ఎంత వరకూ ఉంటుంది అన్నది అయితే ఈ రోజుకు తెలియదు అని అంటున్నారు. కేటీఆర్ కొంతకాలం పాటు జైలులోనే ఉంటే అపుడు బీఆర్ ఎస్ పరిస్థితిఏంటి అన్నది చర్చకు వస్తోంది. ఇక దీని మీదనే బీఆర్ఎస్ అగ్రనాయకత్వంలో కూడా చర్చలు సీరియస్ గానే సాగుతున్నట్లుగా చెబుతున్నారు.కేటీఆర్ కనుక జైలుకు వెళ్ళాల్సిన పరిస్థితి వస్తే బాధ్యతలను మరో కీలక నేతగా ఉన్న హరీష్ రావుకు అప్పగిస్తారు అని కూడా ప్రచారంలో ఉంది.

## ఏఐసీసీ నేతలను కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రావు

గజ్వేల్:09 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )



టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు గురువారం టిపిసిసి కార్యాలయం గాంధీభవన్లో ఏఐసిసి నేతలను కలిశారు. ఏఐసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ కేసీ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాస్ మున్షిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యల పైన చర్చించినట్లు బండారు శ్రీకాంత్ రావు తెలిపారు.

## శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

గజ్వేల్:09జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )

ఆహా ఏమి రుచి తినర మైమరచి.. అనే సినిమా పాటను మైమరిపించేలా పలు రకాల వంటకాలను తయారు చేసి గజ్వేల్ పట్టణం లోని స్థానిక శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు సంక్రాంతి పండుగ సంబరాలు జరుపుకున్నారు.



స్వయంగా విద్యార్థులే తయారు చేసి పాఠశాలలో ప్రదర్శించారు. ఈ ఫుడ్ఫెస్టివల్ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై విద్యార్థులు తయారుచేసిన పలు రకాల పిండి వంటలు, స్వీట్స్, పాయసం, లడ్డు, జొన్న రొట్టెలు, మిర్చీలు,బజ్జీలు తయారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాల కరస్పాండెంట్ హరిణ పవన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జంక్ ఫుడ్ అలవాటై పోశకాలున్న ఆహారాన్ని మర్చిపోతున్న ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యతను తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని సన్మానించిన మానాల

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)జనవరి 09:

నిజామాబాద్ పర్యటనలో భాగంగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కి గురువారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి స్వాగతం పలికి సన్మానించారు.అదేవిధంగా వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవనీ రెడ్డి, రాం రెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్ లను సన్మానించారు.వీరితో పాటు రాష్ట్ర వితనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,కమ్మర్పల్లి మార్కెట్



కమిటీ చైర్మన్ పాలెం నర్సయ్య,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్,వేల్పూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూమా రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ నాయకులు శివ,చింటూ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం క్యాలండర్ ఆవిష్కరించిన ఎన్ సీ సంతోష్

గజ్వేల్:09 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ లో గురువారం సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ చేతుల మీదుగా భారత్ ఖాదీ క్లాత్ స్టోర్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ భారత్ ఖాదీ క్లాస్ స్టోర్ యజమాని నరేందర్ రెడ్డిని అభినందించారు. వినియోగదారుల మన్నన పొందుతూ మంచి గుర్తింపు తెచ్చుకున్న భారత్ ఖాదీ క్లాత్ స్టోర్ మంచి గుర్తింపు పొందిందని, యువత వ్యాపారంలో రాణించాలని ఉద్దేశంతో సొంతగా వ్యాపారాన్ని కొనసాగిస్తూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్న



నరేందర్ రెడ్డి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, ఆరిఫ్, బ్రాహ్మణపల్లి బిక్షపతి, బాలేష్, సతీష్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు





# ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

## అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా బొల్లం శ్రీనివాస్,సిహెచ్ వీరారెడ్డి.

హైదరాబాద్,జనవరి09, (ప్రజా కలం ప్రతినిధి)

ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం రాంనగర్ లోని రాజ్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ కు సంబంధించిన వివిధ అంశాలను చర్చించడం తోపాటు నూతన కార్యవర్గాన్ని ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొల్లం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గా సిహెచ్ వీరారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ గా సి శివకుమార్, కోశాధికారిగా కే నరసింహ, ప్రచార కార్యదర్శిగా జీవన్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా బి కనకరాజు,ఎం జహంగీర్, రామగిరి భీష్మాచారి, కార్యదర్శులుగా బి.సతీష్, సి.అఖిలేష్,బి.మనోహర్, సలహాదారులుగా నాగవాణి లతోపాటు సభ్యులుగా ప్రేమ్ సాగర్,రామ్ రెడ్డి, బాలకృష్ణ, సంపత్,జి శ్రీనివాస్,శ్రీధర్, రహీం,వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. ఈ నూతన కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగనుంది. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంమే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. హెల్త్ కార్డులు, ఇండ్ల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు.

# నేత్రా స్టార్స్ మూడోసీజన్ ఎగ్జిబిషన్

## రెండు రోజులు పాటు ప్రదర్శన,కొలువుదీరిన వస్తువులు

## బంగారు,వస్త్రాలు మహిళలకు ఇష్టం-డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్

కంటోన్మెంట్ జనవరి 9 ప్రజాకలం ప్రతినిధి

మహిళలు దుస్తులు, బంగారానికి ప్రాధాన్యత ఇస్తారని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజికవర్గం క్లసిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన నేత్రా స్టార్స్ ఎగ్జిబిషన్ ను ఆమె ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్, కళాకారులకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా వివరించారు. సంక్రాంతి,పొంగల్ స్పెషల్ నేత్రా స్టార్ ఆద్వర్యంలో మూడవ సీజన్ ను ప్రారంభించారు .రెండు రోజులు పాటు సాగే ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తుల వారు తమ వస్తువులను ఇక్కడు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పండగ సందర్భంగా కావల్సిన ప్రతి వస్తువు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. మొత్తం 72 స్టాల్స్ ను ఏర్పాటు చేసినట్లు నేత్రా స్టార్ నిర్వహకులు మనీష తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ బిజెపి కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, హేమ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.



# మహిళలందరూ కాంగ్రెస్ ను ప్రతిష్టం చేయాలి:కొలన్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా షేక్ రఫియా బేగం నియమించబడిన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మద్యదాపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలందరూ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందే విధంగా మీరందరు కృషి చేయాలని ఆ దిశగా ప్రయాణం సాగించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలందరూ సహకరించడం వల్ల అధికారంలోకి వచ్చామని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, NMC అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, బిక్కన్ షా, పద్మ రావు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో ముక్కోటి ఏకాదశి కి ఏర్పాట్లు పూర్తి



యాదగిరిగుట్ట, జనవరి09 ( ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ సన్నిధిలో ఈ నెల10వతేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5గంటల15 నిమిషాలకు భక్తులకు ఉత్తర ద్వారం దర్శనమివ్వనున్నారు లక్ష్మీ సమేత నారసింహుడు అదేరోజు ముక్కోటి ఏకాదశి రోజున లక్ష పుష్పార్చన,ఆర్జిత నిజాభిషేకం,సహస్రనామార్చన రద్దు చేసిన ఆలయ అధికారులు...అదేవిధంగా ఆలయంలోఈ నెల10వ తేదీ నుండి 15వతేదీ వరకు ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు..

నిర్వహణఅధ్యయనోత్సవాలు జరిగే ఆరు రోజులు ఉదయం,సాయంత్రం వివిధ అలంకార సేవల్లోభక్తులకు దర్శనమివ్వనున్న నారసింహుడు..వైకుంఠ ద్వార దర్శనంకు ప్రత్యేక.దర్శన వరుసలు,వీవీఐపీల గ్యాలరీలు, విద్యుత్ దీపాల అలంకరణ, స్టేజీలు,తదితర అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఆలయ ఈవో భాస్కర్ రావు తెలిపారు.

# ఆర్ సీ సీ పైప్ లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

మల్కాజిగిరి,జనవరి09, (ప్రజా కలం ప్రతినిధి)

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీలను ఓ ప్రణాళికబద్ధంగా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఐఎన్ నగర్ కాలనీలో రూ.22 లక్షల వ్యయంతో జరుగుతున్న ఆర్ సీసీ పైప్ లైన్ పనులను కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఈ దివ్య జ్యోతి,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, నాయకులు బైరు అనిల్ కుమార్,నర్సింగరావు,నగేష్ గౌడ్,స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆలయాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయండి: కోలన్.

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్

ఆలయాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ గా శ్రీనివాస్ చారీ, రవీందర్, రాజు, వేణుగౌడ్ లు నియమితులైన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్ద పీఠం వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ ఆలయానికి తన వంతు సహాయ సహకారాలు చేస్తానని భరోసా నిచ్చారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, క్రిష్ణగౌడ్, రషీద్, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి



శామీర్ పేట్ / జనవరి 09 ( ప్రజా కలం ప్రతినిధి )

హిందువుల అత్యంత పవిత్రంగా జరుపుకొనే పండుగల్లో వైకుంఠ ఏకాదశమిని ప్రముఖంగా పేర్కొనవచ్చు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్రమాసంతో మొదలుకొని ఫాల్గుణ మాసం వరకు ఏటా 24 ఏకాదశిలు వస్తుంటాయి. అందులో సూర్యగ్రమనం ప్రకారం ధనుర్మాసంలో శుక్లపక్షమి ఏకాదశి అని, పుత్రత ఏకాదశి అని పిలుస్తారు. శ్రీహరికి ఇష్టమైన ప్రదేశం వైకుంఠం. ఇష్టమైన తిథి ఏకాదశి. అలాంటి ఏకాదశుల్లో అత్యంత ప్రాధాన్యమున్నదే వైకుంఠ ఏకాదశి. స్వర్గధామం, ముక్కోటి ఏకాదశి అని పిలిచే ఈ ఏకాదశిని వైష్ణవ ఆలయాల్లో అత్యంత వైభవంగా జరుపుతారు. నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలో శ్రీ విష్ణు శివాలయం (అక్కన్న మాదన్న) వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముస్తాబైయింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 2గంటల నుంచే ఆలయంలో శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 5గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లను
వైభవంగా జరుపుతున్నట్లు
ఆలయ పూజారి ధర్మకర్త గ్రామ పురోహితులు త్రిగుల్ల వెంకటేశ్వర శర్మగారు ఉద్దెమర్రి అక్కన్న మాదన్న దేవాలయ,శ్రీ విష్ణు శివాలయం కమిటీ చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరీ, కమిటీ సభ్యులు తెలిపారు.

**ఉత్తర ద్వార దర్శనం.. మోక్షదాయకం**

మహావిష్ణువుకు ప్రీతికరమైన ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వారంలో విష్ణువును దర్శించుకోవడం మోక్షదాయకమని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున వైకుంఠ సప్తద్వారాలు తెరుచుకొని ఉంటాయని, వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారాన్నే వైకుంఠ ద్వారంగా భావించి వేకువజాము నుంచే స్వామి వారి దర్శనార్థం భక్తులు నిరీక్షిస్తారు. ఇదే రోజున మహా విష్ణువు గరుడ వాహనారుడై ముక్కోటి దేవతలతో కలిసి భువికి దిగివచ్చి దర్శనమిస్తాడని భక్తుల విశ్వాస నమ్మకం.

ఈరోజు సూర్యోదయానికి ముందే స్నాన, సంధ్యాధులు పూర్తి చేసుకొని దేవాలయానికి వెళ్లి ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటే ఆ పరమాత్మ అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుందని, ముక్కోటి దేవతలు ఆశీర్వదిస్తారని భక్తుల విశ్వాసం.

**ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలి**

వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు కలియుగదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలి. దీని ద్వారా భక్తులకు సుఖ సంతోషాలు, ఐష్టైశ్వర్యాలు కలుగుతాయి. కుటుంబంలో భక్తుడికి ఏ పరమైనటువంటి అవసరం ఉంటుందో ఆ భగవంతుడు అనుగ్రహాన్ని అందజేస్తారు పితృదేవతలకు స్వర్గలోక ప్రాప్తి లభిస్తుంది. ఈరోజున ఉపవాసం, జాగరణ చేయాలి. బియ్యంతో చేసిన ఆహారాన్ని తీసుకోకూడదు. పిండితో చేసిన వంటకాలను భోజనం చేయాలి. నారాయణ నామస్మరణ చేసుకోవడం శుభప్రదం. భక్తులందరూ వైష్ణవాలయంలో గడిపితే శుభప్రదంగా ఉంటుంది.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com